**నేడు అంబేద్కర్ మనవడు ఖమ్మం రాక**




PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

**రోగులకు పండ్లు.. విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ**




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 216 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 01 ఆగస్టు 2026


# మీ రాక కోసం ఎదురుచూస్తున్నాం మోదీజీ

**•ప్రధాని ట్వీట్‌ను రీ ట్వీట్ చేసిన చంద్రబాబు**



**అమరావతి,జూలై 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో నిర్మితమైన ఈ విమానాశ్రయాన్ని ఆగస్టు 1న శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. 'రేపు భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రారంభిస్తున్నాం' అంటూ ఏపీ పర్యటనపై ఎక్స్‌లో ప్రధాని పోస్ట్ చేశారు. ఉత్తరాంధ్రకు మౌలిక సదుపాయాల కల్పనలో కీలక అడుగు పడుతోందని చెప్పారు. ప్రధాని పోస్ట్‌ను ట్రాక్ చేస్తూ సీఎం చంద్రబాబు రీ పోస్ట్ చేశారు. 'ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధంగా ఉంది... మీ రాక కోసం ఎదురుచూస్తున్నాం మోదీ జీ' అంటూ పోస్టు చేశారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలొచ్చాయని, ఉత్తరాంధ్రకు గేట్‌వేగా భోగాపురం ఎయిర్‌పోర్టు నిలుస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇక, ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

# ఉపాధి, ఉద్యోగాల కల్పనపై సీఎం దృష్టి



**•టామ్‌కాంకు కొత్త బాధ్యతలు అప్పగింత •డ్రైవింగ్, విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ**
**•స్కిల్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు •అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్,జూలై 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** టామ్‌కాంకు కొత్త బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పాస్‌పోర్టు నుంచి ఉద్యోగం వరకు సేవలు అందజేయాలని సూచించారు. విదేశీ ఉద్యోగాల కోసం టామ్‌కాం, మ్యాన్‌పవర్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. యువత ఉపాధి, నైపుణ్యాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో యువత ఉపాధి, నైపుణ్యాలపై శక్తి శాఖ అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు అంశాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. విదేశాలకు వెళ్లే కార్మికుల పూర్తి వివరాలను నమోదు చేయాలని సీఎం మార్గనిర్దేశం చేశారు. టామ్‌కాంకు మాజీ ఐఎఫ్ఎస్ అధికారిని సీఈవోగా నియమిస్తామని అన్నారు. డ్రైవింగ్, విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. మిగతా2లో...

# ఇందిరమ్మ టవర్స్‌కు టెండర్ ప్రారంభం

**• ఆగస్ట్ చివరలో నిర్మాణాలకు శ్రీకారం • రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**హైదరాబాద్,జూలై 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు ఆగస్టు చివరి వారంలో శ్రీకారం చుడతామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. క్యూర్ లో ఇందిరమ్మ టవర్స్ టెండర్ పక్రియ ప్రారంభం చేస్తామన్నారు.

మిగతా2లో...

# కొత్తగా రూ.4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులు

**●ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు 5,070 కోట్లు**
**●పిఎం కిసాన్ సమ్మాన్ నిధికి 3,15,614 కోట్ల రూపాయలు**
**●కేబినేట్ నిర్ణయాలను వెల్లడించిన అశ్వినీ వైష్ణవ్**

**న్యూఢిల్లీ,జూలై 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర కేబినెట్ నేడు రూ.4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఈ వివరాలను మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. మొత్తం 4,50,988 కోట్ల రూపాయల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు 5,070 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు. మిగతా2లో...





# నకిలీ ఎరువులు కొని మోసపోవద్దు

**- లైసెన్స్ పొందిన డీలర్ల వద్దే కొనండి**
**- రైతులకు వ్యవసాయ శాఖ హెచ్చరిక**

**హైదరాబాద్,జూలై 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లోని రైతులు.. నకిలీ ఎరువులు కొనుగోలు చేసి.. ఇబ్బంది పడుతున్నట్లు వ్యవసాయశాఖకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మిగతా2లో...

# హెల్త్ కేర్ ట్రస్ట్ నిధుల సద్వినియోగం

**- అధికారులతో సమీక్షించిన సిఎస్ సంజయ్ జాజు**




# తెలంగాణలో మరోమారు సర్ గడువు పొడిగింపు

**● మరో వారం రోజులు పొడిస్తూ ఇసి ఆదేశాలు ● ఆగస్ట్ 10 వరకు పొడగించినట్లు వెల్లడి**




**హైదరాబాద్,జూలై 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని మరోమారు పొడిగించింది. ఆగస్టు 10 వ తేదీ వరకు ఓటర్లు తమ వివరాలను బీఎల్‌వో లకు అందజేయాలని స్పష్టం చేసింది. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలని ఆదేశాలు జారీ చేసింది. ఆగస్టు 17న డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను విడుదల చేస్తామని సెప్టెంబర్ 16వ తేదీ వరకు ÷–లకెయిములు, అభ్యంతరాలను స్వీకరిస్తామని వివరించింది. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు క్లెయిములను అభ్యంతరాలను పరిష్కరిస్తామని , మిగతా2లో...




# తెలంగాణలో ఫ్యామిలీ సర్టిఫికెట్

**జారీ ప్రక్రియని ప్రారంభించిన డిప్యూటి సిఎం భట్టి**

**హైదరాబాద్,జూలై 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రజలకు ప్రభుత్వం కొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ పక్రియ ప్రారంభమైందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇకపై కుటుంబ సభ్యుల సమాచారం.. వారి పూర్తి వివరాలతో కూడిన ఫ్యామిలీ ధ్రువపత్రాలను మిగతా2లో...

# జన నేతకు కన్నీటి వీడ్కోలు

**పెద్ది సుదర్శన్‌రెడ్డి అంతిమ యాత్రకు వేలాది జనం**
**అధికార లాంఛనాలతో అంత్యక్రియలు**
**మంత్రి సీతక్క, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు నివాళి**




# నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి

**- కల్వకుంట్ల కవిత డిమాండ్**




**హైదరాబాద్,జూలై 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** కార్మికులకు వ్యతిరేకంగా కేంద్రం తీసుకొచ్చిన నాలుగు కొత్త లేబర్ చట్టాలను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్ లోని టీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో

మిగతా2లో...

# రాష్ట్రంలోని ప్రాజెక్టులకు జలకళ

**శ్రీరాంసాగర్‌కు పెరిగిన వరద ఉధృతి**

**జూరాలకు భారీగా చేరుకుంటున్న వరద**

**ఎల్లంపల్లి వద్ద శ్రీపాదకు భారీగా నీరు రాక**

**భద్రాచలం వద్ద గోదావరికి ఒకటో నంబర్ హెచ్చరిక జారీ**



**హైదరాబాద్,జూలై 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. ఆయా ప్రాజెక్టుల్లోకి వరదనీరు చేరడంతో కళకళలాడుతున్నాయి. నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ నుంచి జలాశయంలోకి 74,950 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1069.20 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 21.7 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద నీరు తరలివస్తుంది . ఎగువ నుంచి 1,46,000 క్యూసెక్కుల నీరు వస్తుండగా అప్రమత్తమైన ఇంజినీరింగ్ అధికారులు 28 గేట్లను ఎత్తి దిగువకు 1,33,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలం జలాశయానికి వరద నీటి ప్రవాహం నిరంతరాయంగా కొనసాగుతోంది. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో పాటు కడెం జలాశయం గేట్లు ఎత్తడంతో పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 15 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 1,21,354 క్యూసెక్కులు కాగా అవుట్‌ఎ÷-లో 1,08,493 క్యూసెక్కులుగా ఉంది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలకు గాను ప్రస్తుతం 18.45 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గోదావరి పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఎగువ నుంచి వస్తున్న వరదతో భద్రాచలం వద్ద గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. శుక్రవారం ఉదయం 10.30 గంటల వరకు గోదావరి ప్రవాహం 43 అడుగులకు చేరింది. కల్యాణ కట్ట, స్నానఘట్టాలు వరద నీటిలో ఉన్నాయి. ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నీటి మట్టం 43 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ములుగు జిల్లాలో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. మేడిగడ్డ నుంచి 8.35లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. దీంతో తుపాకులగూడెంలోని సమ్మక్క బ్యారేజీ 59 గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తున్నారు. వాజేడు మండలం టేకులగూడెం వద్ద రహదారిపైకి వరద నీరు చేరింది. వరద నీటితో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వెంకటాపురం మండలం బోదాపురం వంతెనపైకి వరదనీరు చేరడంతో వెంకటాపురం-భద్రాచలం మధ్య రాకపోకలకు అంతరాయమేర్పడింది.

# తెలంగాణలో మరోమారు సర్ గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

అక్టోబర్19న ఫైనల్ పబ్లికేషన్‌ను విడుదల చేస్తామని వెల్లడించింది. ఈ మేరకు తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియ గడువును మరోసారి పొడిగించారు. ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించే గడువును ఆగస్టు 10 వరకు పొడిగించారు. ఆగస్టు 3న ముగియాల్సిన గడువును 10వ తేదీ వరకు పొడిగిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. తొలుత ఈ గడువు జులై 24 వరకే ఉండగా ఆగస్టు 3కు పొడిగించారు. తాజాగా ఆ తేదీని ఆగస్టు 10కి మార్పు చేశారు.

ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 77.12 శాతం ఎన్యూమరేషన్ పూర్తయిందని ఈసీఐ తెలిపింది. హైదరాబాద్ జిల్లాలో 56.31 శాతం, రంగారెడ్డిలో 63.43, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 61.37 శాతం పూర్తయినట్లు పేర్కొంది. ఇదిలావుంటే కేంద్ర ఎన్నికల సంఘం సెక్రటరీ నవీన్ కుమార్ తెలంగాణలో పర్యటించారు. సర్ పక్రియను సమీక్షించేందుకు ఆయన రాష్ట్రానికి వచ్చారు. అంతకుముందు ఆయనకు తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి, అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వాసం వెంకటేశ్వర రెడ్డి స్వాగతం పలికారు. నవీన్ కుమార్ సుదర్శన్‌రెడ్డితో రాష్ట్రంలో జరుగుతున్న 'సర్' పక్రియ పురోగతిపై చర్చించారు. అనంతరం జీహెచ్‌ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎలక్షన్ ఆఫీసుకు వెళ్లి అధికారులతో మాట్లాడారు.

# తానొక ఆప్త మిత్రున్ని, ఉద్యమ సహచరున్ని కోల్పోయా...

**పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల కేసీఆర్ సంతాపం**

**పార్టీ అండగా ఉంటుందని చెప్పిన బీఆర్ఎస్ అధినేత**



**హైదరాబాద్,జూలై 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** పెద్ది మృతితో తానొక ఆప్త మిత్రున్ని ఉద్యమ సహచరున్ని కోల్పోయానని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేసారు. కుటుంబ సభ్యులకు పార్టీ కార్యకర్తలకు పెద్ది అభిమానులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. పెద్ది కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది... కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతితో తన సంతాపాన్ని ప్రకటించారు. ఉద్యమ సహచరున్ని, ఆప్త మిత్రున్ని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేస్తూ పెద్ది మరణం పట్ల కేసీఆర్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన మలిదశ పోరాటంలో, వరంగల్లు జిల్లా ఉద్యమంలో, తనతోపాటు కలిసి నడిచిన జ్ఞాపకాలను కేసీఆర్ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పెద్దిని బతికించుకోవడానికి పార్టీ చేసిన విశ్వప్రయత్నాలూ, డాక్టర్లు చేసిన కృషి విఫలం కావడం పట్ల కేసీఆర్ మనోవేదనను వ్యక్తం చేశారు. తెలంగాణనే శ్వాసగా, నీతి నిజాయితీతో ప్రజాజీవనం కొనసాగిస్తూ సాగించిన రాజకీయ ప్రస్థానం ఆదర్శప్రాయమన్నారు. పోరాటాల ఖిల్లా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట గడ్డపై బీఆర్ఎస్ గులాబీ జెండాను ఎగురవేసి, మొక్కవోని ధైర్యంతో ఉద్యమించిన ధీరుడు సుదర్శన్ రెడ్డి అని కేసీఆర్ గారు కొనియాడారు. ఉద్యమకాలం నుంచి చివరిశ్వాస వరకూ గులాబీ జెండా నీడలో, పార్టీ అడుగుజాడల్లో నడిచిన పెద్ది, అటు పోరాటంలోనూ, ఇటు నియోజకవర్గ అభివృద్ధి లోనూ తనకంటూ చెరగని ముద్ర వేసుకున్నాడని తెలిపారు. పార్టీ పట్ల అత్యంత విధేయతతో పనిచేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పార్టీకి తీరని లోటని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు ఒత్తిళ్లు, నాన్-బెయిలబుల్ కేసులు, జైలు నిర్బంధాలకు కూడా లొంగని పెద్ది సుదర్శన్ రెడ్డి ఉద్యమ పటిమ, ధైర్య సాహసాలు, స్ఫూర్తి, ఆయన చేసిన సేవలు నియోజకవర్గ కార్యకర్తలు ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసుకుంటాయని అన్నారు. పెద్దిని కోల్పోయి శోక తప్త హృదయులై ఉన్న భార్యాపిల్లలకు పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని అధినేత సూచించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, పెద్ది కుటుంబ సభ్యులకు, నియోజకవర్గ కార్యకర్తలు అభిమానులకు, కేసీఆర్ గారు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## నకిలీ ఎరువులు కొని మోసపోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే అప్రమత్తమైంది. దాంతో రైతులకు కీలక సూచనలు చేసింది. నకిలీ డీఏపీ ఎరువులు కొనుగోలు చేయవద్దని రైతులకు స్పష్టం చేసింది. లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద మాత్రమే ఎరువులు కొనాలని సూచించింది. ఎరువులు కొనుగోలు చేసిన తర్వాత.. బిల్లు తప్పనిసరిగా తీసుకుని భద్రపరచుకోవాలని విజ్ఞప్తి చేసింది. తక్కువ ధర పేరుతో ఎరువులు కొని మోసపోవద్దని రైతులకు తెలంగాణ వ్యవసాయ శాఖ వివరించింది. రహదారి పక్కన, లారీల్లో విక్రయించే ఎరువులు కొనవద్దని రైతులకు విజ్ఞప్తి చేసింది. అలాగే ఎరువుల సంచిపై తయారీ, గడవు తేదీలతోపాటు ఎంఆర్‌పీ వివరాలు తప్పనిసరిగా పరిశీలించాలని రైతులను కోరింది. అనుమానాస్పద ఎరువుల బస్తాలను గుర్తిస్తే.. వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించింది. తక్కువ ధర పేరుతో మోసాలకు గురికావద్దని రైతులను హెచ్చరించింది. జిల్లాల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలను వ్యవసాయ శాఖ ముమ్మరం చేసింది. నకిలీ ఎరువుల తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించింది. అప్రమత్తతే రైతుల పెట్టుబడికి రక్షణ అని స్పష్టం చేసింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. అయితే రాష్ట్రంలోని ఐదు జిల్లాలు ముఖ్యంగా రంగారెడ్డి, సూర్యాపేట, కరీంనగర్, నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లో నకిలీ ఎరువుల ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో నకిలీ ఎరువుల విక్రేతలపై కేసులు నమోదు చేశారు. అలాగే నిందితులను అరెస్ట్ చేశారు. వారు నిల్వ చేసిన ఎరువుల బస్తాలను స్వాధీనం చేసుకుని.. వాటిని సీజ్ చేశారు.

## తెలంగాణలో ఫ్యామిలీ సర్టిఫికెట్

(మొదటి పేజీ తరువాయి)

తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవా కేంద్రాల ద్వారా పొందవచ్చని తెలిపారు. కుటుంబ వివరాలను అధికారికంగా ధ్రువీకరించుకునేందుకు ఈ సర్టిఫికెట్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ కుటుంబ సమాచారానికి సంబంధించి అవసరమైన సందర్భాల్లో ఈ ధ్రువపత్రాన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు. ఫ్యామిలీ సర్టిఫికెట్ అన్ని చోట్ల చెల్లుబాటు అవుతుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు, వివిధ అధికారిక అవసరాలు, కుటుంబ వివరాలను సమర్పించాల్సిన సందర్భాల్లో ఈ ధ్రువపత్రం కీలకంగా మారనుందని తెలిపారు. ఇప్పటివరకు కుటుంబ వివరాల ధ్రువీకరణ కోసం ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించడంతో పాటు, ప్రజలకు సులభంగా సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ పక్రియను ప్రారంభించినట్లు వెల్లడించారు. తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

## కొత్తగా రూ.4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే తలసరి సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో భారత్ మొదటి స్థానంలో ఉందని మంత్రి అన్నారు. ఈ పథకం కింద డ్యామ్‌లు, సరస్సులపై ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి 5000 మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశిరచుకున్నామని అన్నారు. రాబోయే ఐదేళ్లల్లో ఎలోటింగ్ సోలార్ ప్యానెల్ విద్యుత్ ఉత్పత్తిని 7 రెట్లు పెంచుతామని చెప్పారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి 3,15,614 కోట్ల రూపాయలు కేటాయించి నట్టు మంత్రి తెలిపారు. 2026-2030 మధ్య కాలానికి ఈ మొత్తాన్ని కేటాయించినట్టు తెలిపారు. ఇక సముద్ర మంథన్ పథకానికి 84,084 కోట్ల రూపాయలను కేంద్రం కేటాయించింది. 2030-31 వరకూ ఈ మొత్తాన్ని వినియోగించనున్నారు. సముద్రం అడుగున దాగున్న ముడిచమురు, సహజవాయువు వనరుల గుర్తింపు కోసం కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఖేలో ఇండియా పథకానికి సంబంధించి కేంద్రం రాబోయే ఐదేళ్ల కాలానికి రూ.29,054 కోట్లు కేటాయించిందని కూడా మంత్రి తెలిపారు. యూనీ డైరెక్షనల్ ట్విన్ ట్యూబ్ టన్నుల్స్ నిర్మాణానికి 9,779 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు.

## జన నేతకు కన్నీటి వీడ్కోలు

**నర్సంపేట,జూలై 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి భౌతికకాయానికి శుక్రవారం జనం కన్నీటి వీడ్కోలు పలికారు. అధికార లాంఛనాల మధ్య ప్రభుత్వం అంత్యక్రియలు నిర్వహించింది. ఈ నెల 26న గుండెపోటుతో హనుమకొండలోని రోహిణి ఆస్పత్రిలో చేరిన పెద్ది సుదర్శన్ రెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించి శుక్రవారం అర్ధరాత్రి12:30 గంటలకు మరణించినట్టు వైద్యులు తెలిపారు. అక్కడి నుంచి ఆయన భౌతికకాయాన్ని హనుమకొండ మీదుగా నర్సంపేటకు తీసుకొచ్చారు. వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై అడుగడుగునా పెద్దికి జనం నివాళులర్పించారు. గిర్నిబావి సెంటర్ నుంచి నర్సంపేట వరకు 10 కిలో మీటర్ల వరకు రోడ్డుపై అంతిమ యాత్ర జనసందోహంతో కొనసాగింది. పట్టణంలోని అయ్యప్ప గుడి నుంచి ప్రధాన రహదారిపై వేలాది మంది అభిమానుల నడుమ అంతిమ యాత్ర సాగింది. అక్కడి నుంచి సాయంత్రం 6 గంటలకు నల్లబెల్లిలోని పెద్ది స్వగృహానికి ఆయన మృతదేహన్ని తీసుకొచ్చారు. **నివాళులర్పించిన కేటీఆర్, హరీశ్‌రావు, మంత్రి సీతక్క** పెద్ది సుదర్శన్‌రెడ్డి భౌతికకాయానికి మంత్రి సీతక్క, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, గంగుల కమలాకర్, సత్యవత్‌రాథోడ్, మాజీ ఎంపీ కవిత, ఎమ్మెల్సీలు పోచంపెల్లి శ్రీనివాసరెడ్డి, గోరెటి వెంకన్న, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డితో పాటు ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు నివాళులర్పించారు. అంతిమ యాత్రలో హరీశ్‌రావు, కేటీఆర్ తదితర బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. వర్షం కురిసినా అభిమానులు అంతిమ యాత్రలో పాల్గొని పెద్దికి తుది వీడ్కోలు పలికారు. ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించడంతో దానికి తగ్గ ఏర్పాట్లు చేశారు. రాత్రి 8 గంటలకు ఆయన కుమారుడు నిదర్శన్ రెడ్డి చితికి నిప్పంటించారు.

## నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రక్షణ సేన ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ కార్యక్ర మంలో ఆమె మాట్లాడారు. ఆ చట్టాలకు వ్యతిరేకంగా తమిళనాడు, వెస్ట్ బెంగాల్ రాష్ట్రాలు తీర్మానాలు చేశాయని ఆమె గుర్తుచేశారు. కార్మికులకు, ఉద్యోగులకు, టీచర్లకు అన్యాయం జరగనివ్వబోమని ఆమె స్పష్టం చేశారు. టీఆర్ఎస్ కార్మికుల ఫ్రెండ్లీగా అండగా ఉంటుందని తెలిపారు. పరిణితి చెందిన ప్రజాస్వామ్యం అంటే ఆ దేశంలో పనిచేసే ప్రజలకు సంతోషంగా పనిచేసే వాతావారణం కల్పించాలన్నారు. ట్రేడ్ యూనియన్ అంటే రాజ్యాంగ బద్ధంగా మనకు దక్కిన హక్కు అనీ, దాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. మల్కాజిగిరి ఎంపీగా ఉన్న సమయంలో కనీస వేతనం రూ.20 వేలు ఉండాలని, సీఎం అయ్యాకేమో రూ.16 వేలు ఇస్తామంటూ రేవంత్ రెడ్డి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. షెడ్యూల్ ఆఫ్ ఇండస్ట్రీస్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లను చలాన్ల పేరుతో శ్రమదోపిడీ చేస్తున్నారనీ, ఐటీ, ఫార్మా రంగాల్లో యూనియన్లు లేకపోవడంతో అక్కడా అదే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ సంతోషంగా ఉన్నప్పుడే దేశం ముందుకెళ్తుందనీ, అలాంటి వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆమె గుర్తుచేశారు.

## హెల్త్ కేర్ ట్రస్ట్ నిధుల సద్వినియోగం

**హైదరాబాద్,జూలై 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఉద్యోగుల హెల్త్ కేర్ ట్రస్ట్‌పై రాష్ట్ర సీఎస్ సంజయ్ జాజు శుక్రవారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. హెల్త్ కేర్ ట్రస్ట్ నిధుల సద్వినియోగంపై సంబంధిత అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పలు అశాలపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశర చేశారు. చికిత్స ప్యాకేజీ రేట్లపై సమగ్ర సమీక్షకు నిర్ణయించినట్లు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ, సబ్ కమిటీల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయా ఆస్పత్రుల సేవల నాణ్యతపై నిరంతర పర్యవేక్షిస్తున్నట్లు స్పష్టం చేశారు. అత్యవసర వైద్య సేవలకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని సీఎస్ సంజయ్ జాజు మార్గనిర్దేశర చేశారు. 24 గంటల హెల్ప్ సిస్టమ్, వేగవంతమైన అనుమతి పక్రియ చేపట్టాలని సూచించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ఆలస్యం లేకుండా వైద్య సహాయం అందజేయాలని ఆదేశించారు. పారదర్శకంగా, సమర్థవంతంగా ట్రస్ట్ నిర్వహించాలని సీఎస్ సంజయ్ జాజు సూచించారు.

## ఉపాధి, ఉద్యోగాల కల్పనపై సిఎం దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జర్మన్, జపనీస్, కొరియన్ సహా విదేశీ భాషలకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. బ్లూ కాలర్ ఉద్యోగ శిక్షణార్థులకు స్కాలర్‌షిప్‌లపై అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఏటీసీల్లో ఈవీ సర్వీసింగ్, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెడతామని చెప్పుకొచ్చారు. నర్సుల గ్లోబల్ డిమాండ్‌కు అనుగుణంగా కొత్త నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సంబంధిత శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ టవర్స్‌కు టెండర్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తొలి విడతలో 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. మరో 4 నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు పూర్తయిందని చెప్పారు. లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఆగస్టు 10వ తేదీ తర్వాత ఈ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేదన్నారు. ఆధార్‌తో పాటు ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ కూడా చెల్లుబాటు అవుతుందని వివరించారు. ఇల్లు రాకపోతే రూ.10 వేల ఈఎండీ 100 శాతం రీఫండ్ చేస్తామని స్పష్టం చేశారు. యూపిఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లిస్తే అదే ఖాతాకు నగదు రీఫండ్ చేస్తామని చెప్పారు. ఒక్కో ప్లాట్ మార్కెట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉందని వివరించారు. లబ్దిదారుల పేరుపై 20 నుంచి 22 గజాల అన్‌డివైడెడ్ షేర్ ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలోనూ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు.

# రోగులకు పండ్లు.. విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ







**పరకాల, జూలై 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** శివాజీ యువసేన గౌరవ అధ్యక్షుడు రాజ్ పురోహిత్ జయంత్ లాల్ జన్మదినాన్ని పురస్కరించుకుని శివాజీ యువసేన ఆధ్వర్యంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పరకాల ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో సుమారు 50 మంది రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేయడంతో పాటు బ్లడ్ బ్యాంకులో యువసేన నాయకులు రక్తదానం చేశారు. అనంతరం ప్రభుత్వ మాదారం ప్రాథమిక పాఠశాల, వెలుమా వాడ ప్రాథమిక పాఠశాల, దళితవాడ ప్రాథమిక పాఠశాలల్లో సుమారు 100 మంది విద్యార్థులకు పలకలు, బలపాలు, పరీక్షల ప్యాడ్లు, లాంగ్ నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. అలాగే ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)లో సుమారు 180 మంది విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జయంత్ లాల్ మాట్లాడుతూ, శివాజీ యువసేన ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తమవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని హామీ ఇచ్చారు. శివాజీ యువసేన నాయకులు వెనిశెట్టి రాజేష్, ఎండి అఫ్రోజే, జిల్లెల్ల రాజకుమార్, చంటి, పున్నమి అశోక్, పున్నమి అర్జున్, సిద్ధు, ఆనంద్, వినోద్, సునీల్, కాసిం, మహేందర్ తదితరు లతో పాటు పాఠశాలలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమం




**పరకాల, జూలై 31 (పిసీడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరకాల జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బేటి సంతోష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,విద్యార్థిని మరియు విద్యార్థులు కళాశాల ఆవరణలోని అనవసరమైన మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేయడం జరిగింది అదేవిధంగా కళాశాలలో కంకర కుప్పలను తొలగించి కళాశాలలో అమర్చిన ట్రాన్స్ఫార్మర్ చుట్టూ కంకరతో లెవెల్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం ను ఉద్దేశించి ప్రిన్సిపల్ మాట్లాడుతూ మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల అనారోగ్య సమస్యల బారిన పడకుండా కాపాడుకోవచ్చని తెలిపారు కాబట్టి ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవాభావమును అలవర్చుకొని పరిసరాలను శుభ్రపరచి సమాజాన్ని చైతన్యవంతం చేయాలని విద్యార్థులకు విన్నవించారు. ఈ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అన్నం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ మల్లయ్య , డాక్టర్ బి విజయపాల్ రెడ్డి బి మహేందర్ రావు డాక్టర్ భీమ్రావు, డాక్టర్ అలీషాల అశోక్, డాక్టర్ కే జగదీష్ బాబు సమ్మయ్య, డాక్టర్ బి కల్పన, ఎస్ రాజశ్రీ, డాక్టర్ దుప్పటి సంజయ్, డాక్టర్ స్వప్న , అలేఖ్య మరియు విద్యార్థిని విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడమైనది.

# మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షుడిగా కోట శ్రీనివాసరావు





**కల్లూరు, జూలై 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మత్స్యశాఖ సొసైటీ గ్రామ అధ్యక్షుడిగా కోట శ్రీనివాసరావు ఎన్నిక చేయబడ్డారు. మండల పరిధిలోని యర్రబోయినపల్లి గ్రామపంచాయతీ నందు మత్స్యకారుల సొసైటీ నూతన కమిటీని గ్రామ సర్పంచ్ పోట్రు శ్రీనివాసరావు, మత్స్యశాఖ అధికారి సీనియర్ ఇన్స్పెక్టర్ గుడివాడ విశ్వజిత్ సమక్షంలో ఎన్నుకోవడం జరిగింది. నూతన సొసైటీ అధ్యక్షుడిగా కోట శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా ఇనపనూరి నరసింహారావు, కార్యదర్శిగా తాళ్ల నరసింహారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం మత్స్యకారుల సొసైటీ సభ్యుల అంగీకారంతో ఎన్నుకోబడిన నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. 20 సంవత్సరాలుగా సొసైటీ కార్యవర్గ సభ్యులుగా ఉంటూ సొసైటీ కార్యవర్గాన్ని, సభ్యులను సమన్వయపరుస్తూ పలు కీలక నిర్ణయాల్లో చేదోడు వాదోడుగా ఉండడంతో కోట శ్రీనివాసరావును అధ్యక్షుడిగా నియమించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నుకోబడిన కోట శ్రీనివాసరావు మాట్లాడుతూ సొసైటీ సభ్యుల సహకారంతో బాధ్యతాయుతమైన పదవిని తనకు అప్పగించినందుకు ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలియజేశారు. నాపై మీరు పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సొసైటీ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. సభ్యుల సమిష్టి సహకారంతో పారదర్శకతగా వ్యవహరిస్తూ ముందుకెళతానని తెలిపారు. సొసైటీ అభివృద్ధికి అందరి సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకుంటూ సరైన నిర్ణయాన్ని తీసుకుంటూ పని చేద్దామని సూచించారు. గ్రామ పెద్దలు సింగిశాల ప్రసాద్, కోట రవీంద్రరావు, నల్లగట్ల వెంకటేశ్వరరావు, కోట రాములు, గొల్లమందల సుందర్రావు, నల్లగట్ల లక్ష్మయ్య, మల్లాది అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ ప్రభుత్వ కళాశాలలో డ్రగ్స్ నిరోధం, సైబర్ నేరాలపై పోలీసుల అవగాహన సదస్సు..






**హన్మకొండ జులై 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాకతీయ ప్రభుత్వ కళాశాల (అటానమస్ ) హనుమకొండ. జాతీయ సేవా పథకం మరియు యాంటీ డ్రగ్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి మరియు అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ రఘునాథ రెడ్డి గార్లచే డ్రగ్స్ నిరోధం, సైబర్ నేరాలు, బాలికల రక్షణ వంటి విషయాలపై చైతన్యం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ నేరాలు జరిగినట్లయితే వీలైనంత తొందరగా 1930 నెంబర్ కు కాల్ చేయవలెనని, ఆపద సమయంలో 100 నెంబర్ కు కాల్ చేయవలెనని ,వరంగల్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాలకు ప్రత్యేక పోలీస్ స్టేషన్ కలదని తెలియజేస్తూ విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని ,విద్యార్థులు వారి తల్లిదండ్రులను వారి పరిసర ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరినారు . ఈ కార్యక్రమం ఉద్దేశించి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రం శ్రీనివాస్ గారు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ గంగిశెట్టి శ్రీనివాస్ ,డాక్టర్ సీతారాములు, డాక్టర్ సంధ్యారాణి ,డాక్టర్ గన్ సింగ్ ,యాంటీ డ్రగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ శశి కుమార్, యాంటీ డ్రగ్ కమిటీ సభ్యులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు అంబేద్కర్ మనవడు ఖమ్మం రాక

### వెలుగుమట్ల ఇండ్లు కూల్చివేతకు నిరసనగా నేడు ఖమ్మంలో ర్యాలీ

### అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన

### విలేఖరుల సమావేశంలో బీసీ ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి పొడకండి రాంబాబు




**ఖమ్మం, ప్రతినిధి జూలై 31 (పిసిడబ్ల్యూన్యూస్):** వెలుగుమట్ల లో నిరుపేదల ఇండ్లు కూల్చివేతకు నిరసనగా నేడు ఖమ్మంలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి పొడకండి రాంబాబు తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వెలుగుమట్ల పేద ప్రజల ఇల్లు కూల్చడం దుర్మార్గపు చర్యను ఖండిస్తూ బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ విశారదన్ మహరాజ్ నేతృత్వంలో మహా ధర్నా అమర నిరాహార దీక్షల ఫలితంగా వెలుగుమట్లలోనే ప్రభుత్వం 311 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడం మిగతా 500 మందికి ఆయా కారణాల చేత వారికి ఇవ్వకపోవడం దారుణం అని ఉన్నారు. మిగిలిన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సుదీర్ఘ పోరాట ఫలితంగా వారికి కూడా ఇస్తామని ముందుకు రావడమే కానీ వెలుగుమటలు కాకుండా వేరే ప్రాంతంలో ఇవ్వటాన్ని నిరసిస్తూ వెలుగుమట్లలోనే వారికి కూడా ఇల్లు ఇవ్వాలని ఆగస్టు ఒకటి మధ్యాహ్నం 12 గంటలకు జడ్పీ సెంటర్ వరకు వెలుగుమట్ల బాధితులతో భారీ నిరసన ర్యాలీని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చర్యల వల్ల గుడిసె వాసులకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. నేడు ఖమ్మంలో జరిగే నిరసన ర్యాలీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మనవడు భీమ్రావు యశ్వంత్ అంబేద్కర్, మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ విశారదన్ మహరాజ్ ఎందరో ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రజాతంత్ర అభ్యుదయ మానవతావాదులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. బాధితురాలు సుమలత మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే వెలుగుమట్లలో ఇల్లు ప్రకటించకపోతే రాహుల్ గాంధీ ఇల్లు ముట్టడి చేస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కేతవరపు కృష్ణారావు , వెలుగుమట్ల బాధితులు వట్టే ఉదయ్, ఎండీ అమిత్, మట్ట నవ్య, మౌనిక, పోలూరి రాము, శివరాత్రి కృష్ణ, బుజ్జి నరసింహారావు, హసీనా, డి. రాము, వేముల కోటేశ్వరరావు, ఖదీర్ పాషా తదిరులు పాల్గొన్నారు.


# టీఎన్ఎస్ ఇండియా ఫౌండేషన్‌తో కాకతీయ ప్రభుత్వ కళాశాల అవగాహన ఒప్పందం..



**హనుమకొండ జూలై 31(పిసిడబ్ల్యూ న్యూస్) :** విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరచే లక్ష్యంతో కాకతీయ ప్రభుత్వ కళాశాల (అటానమస్), హనుమకొండలోని టీఎస్‌కేసీ & ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో టీఎన్ఎస్ ఇండియా ఫౌండేషన్తో "క్యాంపస్ టు టెక్ ఎనేబుల్డ్ ఫైనాన్షియల్ కెరీర్స్ ప్రోగ్రామ్" అమలుకు అవగాహన ఒప్పందం (వీశీఖ) కుదిరింది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఆర్థిక సేవల రంగానికి అవసరమైన ఆధునిక ఆర్థిక, డిజిటల్ నైపుణ్యాలు, కెరీర్ రెడీనెస్ శిక్షణ, ఉపాధి సామర్థ్యాల పెంపు, ప్లేస్‌మెంట్ సహాయంలి అందించడంతో పాటు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ, పరిశ్రమలతో భాగస్వామ్యం ద్వారా విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణకు కళాశాల ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ & ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా. ఎ. అనిల్ కుమార్. మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన శిక్షణ పొంది ఆర్థిక సేవల రంగంలో మెరుగైన కెరీర్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. టీఎన్ఎస్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధి ఈషాన్ సింగ్. కార్యక్రమం లక్ష్యాలను వివరించి, కళాశాలతో కలిసి విజయవంతంగా కార్యక్రమాన్ని అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. శ్రీనాథ్, డా. శ్రీకాంత్, ఎం. రవికుమార్, డా. వెంకన్న, డా. శివనాగ శ్రీనివాస్, సమ్మయ్య, సాగర్‌లి తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

# మల్లంపల్లి సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన శ్రీనగర్ కాంగ్రెస్ నాయకులు

**మల్లంపల్లి మండల ప్రతినిధి జూలై 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మల్లంపల్లి గ్రామ సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు తల్లి మృతికి శ్రీనగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ పరామర్శ కార్యక్రమంలో శ్రీనగర్ కాంగ్రెస్ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ నెమలిపురి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు తుత్తూరు రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుగులోతు లచ్చిరాం, కామ రమేష్ తదితరులు పాల్గొన్నారు. దివంగతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ల్యాద శ్యామ్‌రావు తల్లి గ్రామంలో అందరితో ఆప్యాయంగా మెలిగే వ్యక్తి అని, ఆమె మరణం కుటుంబానికే కాక గ్రామ ప్రజలకు కూడా తీరని లోటని అన్నారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని, పార్టీ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దివంగత ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు భగవంతుడు ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు, కుటుంబ సభ్యులు పాల్గొని దివంగతురాలికి ఘనంగా నివాళులర్పించారు.



## పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న పరకాల బీఆర్ఎస్ యువ నాయకులు




**పరకాల, జులై 31 (పిసిడబ్ల్యు న్యూస్):** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రలో పరకాల నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకులు పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జూపాక కార్తీక్, బోచ్చు చంటి, సిలువేరు భాను, అరుణ్, రాజ్‌కుమార్, శ్రీను, మున్నా, వివేక్, ఫయాజ్ తదితరులు అంతిమయాత్రలో పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రజాసేవలో పెద్ది సుదర్శన్ రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని వారు పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా యువ నాయకులు తెలిపారు.

## ఆదివాసిల సమస్యలపై ఆగస్ట్ 24 ఏటూరు నాగారం ఐటిడిఏ ముట్టడికి తుడుందెబ్బ సిద్ధం

### - నేడు గిరిజన భవన్ లో ఉమ్మడి వరంగల్ జిల్లా తుడుందెబ్బ సమావేశం




**ఏటూరు నాగారం జులై 31 (పిసిడబ్ల్యు న్యూస్):** ఈరోజు గిరిజన భవన్ లో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సమావేశం-శాఖ రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి అధ్యక్షతన జరిగింది ఈ సమావేశం కి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు డా.మైపతి అరుణ్ కుమార్ జాతీయ ఉపాధ్యక్షులు పోడెం బాబు రాష్ట్ర కార్యదర్శి కుడిమేత సమ్మయ్య కోరగట్ల లక్ష్మన్ రావు ASU రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్నిబీల్లి గణేష్ అధివాసి మహిళ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వటం సుభద్ర లు హాజరయ్యారు అంతరం తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షలు డా.మైపతి అరుణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం లో ఆదివాసీల మనుగడ దిన దిన గండంగా మారింది అని 1976 లో అక్రమంగా ఎస్టీ జాబితాలోకి వచ్చిన లంబాడీలు 50 ఏళ్లుగా ఆదివాసీలను దోచుకుంటున్నారని విద్య ఉద్యోగ ఉపాధి రంగాలలో తీవ్ర అన్యాయం చేస్తున్నారని పోరాడిన పలితం లేదు అన్నారు.

## ఆగస్టు 10 వరకు గడువు పొడిగింపు.. ప్రతి ఓటరు గణన ఫారం సమర్పణకు బీఎల్ఏలు సహకరించాలి: పాలడుగు కృష్ణ ప్రసాద్





**ఖమ్మం,ప్రతినిధి, జూలై 31 (పిసిడబ్ల్యు న్యూస్):** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటరు గణన ఫారాల సమర్పణ ఆగస్టు 3 వరకు సమర్పించాల్సి ఉండగా దాని గడువును ఆగస్టు 10 వరకు పొడిగించిన నేపథ్యంలో, ప్రతి అర్హ ఓటరు నిర్ణీత గడువులోగా ఫారం సమర్పించేలా అన్ని రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) చురుకుగా సహకరించాలని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి పాలడుగు కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు.జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన, ఓటర్ల నమోదు, పేర్ల సవరణ, చిరునామా మార్పులు, తొలగింపులు తదితర అంశాలకు సంబంధించిన గణన ఫారాలను ప్రతి అర్హ ఓటరు ఆగస్టు 10లోపు సమర్పించేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా అధికారులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయడంలో బీఎల్ఏలు కీలక పాత్ర పోషించాలని కోరారు.

## వైద్య చికిత్సకు రూ.7 లక్షల ఎల్ఓసీ అందజేత

### - ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి అండగా నిలుస్తోంది: ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచందర్ నాయక్



**హైదరాబాద్,ప్రతినిధి జూలై 31 (పిసిడబ్ల్యున్యూస్):** కురవి మండలం కొత్త తండ నారాయణపురం గ్రామానికి చెందిన శ్రీ ధారావత్ బానియా వైద్య చికిత్స కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 7,00,000 (ఏడు లక్షలు) విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) పత్రాన్ని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచందర్ నాయక్ శుక్రవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో లబ్ధిదారునికి అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ జాటోత్ రామచందర్ నాయక్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వైద్య చికిత్స భారంగా మారకుండా ముఖ్యమంత్రి నాయకత్వంలోని ప్రభుత్వం ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్, లెటర్ ఆఫ్ క్రెడిట్ వంటి పథకాల ద్వారా అండగా నిలుస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న వైద్య సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.లబ్ధిదారుడు ధారావత్ బానియా మాట్లాడుతూ, అత్యవసర వైద్య చికిత్స కోసం రూ. 7 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయడంపై రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచందర్ నాయక్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ రాష్ట్ర సేన ఉప్పల్ ఇన్‌చార్జిగా పంజిరాయ్ శ్రామన్ దేవ్

**కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానం**

**పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో పనిచేయాలని నాయకుల ఆకాంక్ష**

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం.. నిబద్ధతతో పనిచేస్తానన్న శ్రామన్ దేవ్**



**ఉప్పల్, జూలై 31 (పిసిడబ్ల్యు న్యూస్):** తెలంగాణ రాష్ట్ర సేన ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పంజిరాయ్ శ్రామన్ దేవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో పలువురు పార్టీ నాయకులు ఆయనను అభినందించి, నూతన బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా టీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు ఈగ సంతోష్ కుమార్ ముదిరాజ్ మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం శ్రామన్ దేవ్‌కు కీలక బాధ్యతలు అప్పగించడం అభినందనీయమన్నారు. ఆయన నాయకత్వంలో ఉప్పల్ నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఒదేరా సంఘం రాష్ట్ర నాయకుడు ఉరుసు బాలకృష్ణ, టీఆర్ఎస్ ఉప్పల్ సీనియర్ నాయకులు కృష్ణా నాయక్, రంగు శేఖర్ గౌడ్, సంఘీ శ్రీనివాస్, కాయ శంకర్, కటారి సతీష్ తదితరులు మాట్లాడుతూ పార్టీ విస్తరణకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.నూతన ఇన్‌చార్జ్ పంజిరాయ్ శ్రామన్ దేవ్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ బాధ్యతను ప్రజాసేవకు లభించిన అవకాశంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.ఉప్పల్ నియోజకవర్గంలో పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, వారి సహకారంతో పార్టీ ఆశయాలను ప్రతి ఇంటికీ చేరవేసి సంస్థ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పంజిరాయ్ శ్రామన్ దేవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



# నకిలీ నోట్ల నిందితులు 7గురు అరెస్ట్



**వేంసూర్, జూలై 31 (పిసిడబ్ల్యున్యూస్) :**వేమ్సూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ రూ.500 నోట్లను అసలైనవిగా చలామణి చేస్తున్న ముఠాను పోలీసులు ఛేదించి, ఏడుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తు లింగయ్య తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ ముత్తు లింగయ్య మాట్లాడుతూఈ నెల 21వ తేదీన కందుకూరు గ్రామానికి చెందిన ఓ కిరాణా వ్యాపారిని మోసం చేసి, రూ.18 వేల రూపాయలు నగదు ఇచ్చి అదే మొత్తాన్ని ఫోన్‌పే ద్వారా తమ ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. అనంతరం ఆ నగదులో 18 నకిలీ రూ.500 నోట్లు ఉన్నట్లు బ్యాంకు అధికారులు గుర్తించడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు పలు సెక్షన్లతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో నిందితులను గుర్తించి, 30 జూలై 2026న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. నకిలీ నోట్ల సరఫరా అనేది దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన తీవ్రమైన నేరం కావున, ఇట్టి కేసును ఖమ్మం కమిషనర్ ఆఫ్ పోలీస్ సునీల్ దత్, కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ సీరియస్ గా తీసుకొని, వారి పర్యవేక్షణలో విచారణ చేయగా, విచారణలో లారీ డ్రైవర్ గా పనిచేస్తున్న నిందితుడు అయిన కామవరపు కోటకు చెందిన మారం రమేష్ అతని తమ్ముడు మారం మహేష్ మరియు ద్వారకతిరుమల మండలం వెంకట కృష్ణాపురం గ్రామానికి చెందిన సార్నాలా రవీంద్రలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈజీ మని సంపాదించుట గురించి జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన దాసరి ప్రమోద్, మిరియాల చెందు ను సంప్రదించగా వారు తమకు పరిచయమైన దొంగ నోట్లు చలామణి చేసే చింతలపూడి మండలం ఊట సముద్రం గ్రామానికి చెందిన జుజ్జవరపు రవిని పరిచయం చేసినారు. రవి మారం రమేష్, రవీంద్ర వద్ద నుండి ఒక లక్ష రూపాయల ఒరిజినల్ నోట్లను తీసుకొని అందుకు బదులుగా రెండు లక్షల పదివేలు రూపాయలు 5 వందల రూపాయలు నకిలీ నోట్లను ఇవ్వగా ముగ్గురు నిందితులు సత్తుపల్లి, వేంసూరు, ఆంధ్ర ఏరియాలో వాటిని ఒరిజినల్ నోట్లతో కలిపి చలామణి చేసినారు. ఇట్టి క్రమంలో మారం రమేష్ 9 వేలు నకిలీ నోట్లు, 9 వేలు ఒరిజినల్ నోట్లను కందుకూరు గ్రామానికి చెందిన కొప్పుల నాగిరెడ్డి అనే కిరాణా వ్యాపారికి ఇవ్వగా అతను అట్టి నోట్లను బ్యాంకులో డిపాజిట్ చేసే క్రమంలో బ్యాంకు అధికారులు నకిలీవని గుర్తించడంతో అతను వేంసూర్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా ఎస్సై కవిత కేసు నమోదు చేయగా తదుపరి కేసు విచారణ సత్తుపల్లి రూరల్ సిఐ ముత్తు లింగయ్య చేపట్టి, సాంకేతిక ఆధారాలతో నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుండి నేరం చేయడానికి ఉపయోగించిన 7 మొబైల్ ఫోన్లు, 1 మోటార్ సైకిల్ 59 నకిలీ 500 రూపాయల నోట్లు ని స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన జుజ్జునూరి రవి గతంలో నకిలీ కరెన్సీ నోట్లను సరఫరా చేయుచుండగా మంచిర్యాల జిల్లా లక్షట్ పేట పోలీస్ స్టేషన్ నందు అరెస్ట్ అయి బెయిల్ పై బయటకి వచ్చినాడు. అయినా అతను ప్రవర్తన మార్చుకోకుండా, మరొక ప్రధాన నిందితుడైన కాకినాడ యందు చెందిన వైద్యుడుగా చలామణి అవుతూ రెండు వైద్యశాలలు నిర్వహిస్తున్న కొవ్వూరి వినోద్ సతీష్ కుమార్ రెడ్డికి 50 వేల రూపాయలు అసలైన నోట్ల ను ఇచ్చి అతని వద్ద నుండి రూ 2 లక్షల10 వేలు నకిలీ నోట్లను తీసుకొని మిగతా నిందితులకు ఇచ్చినాడు. కొవ్వూరి వినోద్ సతీష్ కుమార్ రెడ్డి గతంలో హైదరాబాద్ సిటీ యందు దొంగ నోట్లు చలామణి చేయుచుండగా, సైబరాబాద్ కమిషనరేట్ లోని రాయదుర్గం పోలీసు వారు అతని అరెస్టు చేసి జైలుకు పంపారు. అయినా అతను ప్రవర్తన మార్చుకోకుండా ఈ దొంగ నోట్లను సరఫరా చేయుచున్నాడు. నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచగా, కేసు దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

# ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి అత్యంత విషాదకరం

### - మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ప్రగాఢ సంతాపం



**సత్తుపల్లి, జూలై 31 (పిసిడబ్ల్యున్యూస్) :**తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఆత్మీయ మిత్రుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి, విషాదానికి గురిచేసిందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఆయన ఆరోగ్యంగా కోలుకుని తిరిగి వస్తారనే ఆశతో అందరం ఎదురుచూశామని, కానీ ఆయన ఇక మన మధ్య లేరన్న వార్త ఎంతో బాధాకరమని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి కీలక పాత్ర పోషించారని, ఉద్యమ స్ఫూర్తిని జీవితాంతం నిలబెట్టిన నిజమైన పోరాట యోధుడిగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన నాయకుడిగా ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం బీఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ సమాజానికి, ఉద్యమ సహచరులకు తీరని లోటని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పేర్కొన్నారు. ఆయన చూపిన సేవా మార్గం, ఉద్యమ నిబద్ధత, నిరాడంబర వ్యక్తిత్వం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు.పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని వారి కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

# కోట్ల ఖర్చు ఖాళీ అవుతున్న ప్రభుత్వ బడులు..!

**కోట్ల వ్యయం ఫలితాలపై ప్రశ్నలు..?**

**మండల విద్యా వ్యవస్థకు పెను సవాల్**

**సింగిల్ డిజిట్ పై బాధ్యత ఎవరిది..?**

**విద్యార్థుల కోసం ఎదురు చూస్తున్న ప్రభుత్వ పాఠశాలలు**



**కల్లూరు, జూలై 31 (పిసిడబ్ల్యూ న్యూస్)** :ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. ఉపాధ్యాయుల జీతభత్యాలు, మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, డిజిటల్ విద్య, మౌలిక వసతులు, విద్యార్థుల సంక్షేమ పథకాలకు భారీగా నిధులు వెచ్చిస్తోంది. అయినప్పటికీ కల్లూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు క్రమంగా తగ్గుతుండడం విద్యావ్యవస్థ పనితీరుపై పెను సవాల్ గా మారడంతో పాటు తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది. విద్యార్థులను ఆకర్షించడంలో ప్రభుత్వ వ్యవస్థ ఎందుకు వెనకాడుతోందన్న ప్రశ్న మొదలైంది. మౌలిక వసతులు పెరిగిన విద్యార్థుల చేరికలు ఎందుకు తగ్గుతున్నాయని పలు విమర్శలు విద్యాశాఖ ఎదుర్కొంటుంది.మండలంలోని 60 ప్రభుత్వ పాఠశాలల్లో కొన్ని పాఠశాలలు సింగిల్ డిజిట్ విద్యార్థులతో కొనసాగుతుండగా, మరోవైపు కేవలం 8 ప్రైవేట్ పాఠశాలల్లోనే ప్రభుత్వ పాఠశాలల కంటే ఎక్కువ మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పరిస్థితి ప్రభుత్వ విద్యపై ప్రజల విశ్వాసం ఏ స్థాయిలో దెబ్బతింటోందో స్పష్టం చేస్తోంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, మండలంలో ఉపాధ్యాయుల జీతభత్యాలకే నెలకు సుమారు రూ.2 కోట్ల వరకు ప్రభుత్వం వ్యయం చేస్తోంది. దీనికి అదనంగా విద్యార్థుల సంక్షేమ పథకాలు, మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, యూనిఫాంలు, మౌలిక వసతుల కోసం కూడా లక్షలాది రూపాయలు ఖర్చు అవుతున్నాయి. అయితే ఈ భారీ పెట్టుబడి విద్యార్థుల నమోదు పెంపులో ప్రతిఫలించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వం తన బాధ్యత నిర్వర్తిస్తోంది... మరి వ్యవస్థ ఎక్కడ విఫలమవుతోంది..? అనే ప్రశ్న ఇప్పుడు సహజంగానే ఉత్పన్నమవుతోంది. ప్రభుత్వం నిధులు ఇస్తే సరిపోదు. వాటిని ఫలితాలుగా మార్చే బాధ్యత విద్యాశాఖ అధికారులపై, పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై, ఉపాధ్యాయులపై కూడా ఉందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. అత్యంత చర్చనీయాంశంగా మారిన విషయం ఏమిటంటే, ప్రభుత్వ ఉద్యోగులు, ముఖ్యంగా కొందరు ఉపాధ్యాయులే తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో కాకుండా ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారనే విమర్శలు. ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకం పెంచాల్సిన బాధ్యత ఉన్న వారే ప్రత్యామ్నాయాన్ని ఎంచుకుంటే, సామాన్య ప్రజలు ప్రభుత్వ పాఠశాలలపై ఎలా విశ్వాసం ఉంచుతారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ అంశంపై అధికారిక గణాంకాలు అందుబాటులో లేకపోయినా, దీనిపై ప్రభుత్వం సమగ్ర అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు సూచిస్తున్నారు. విద్యార్థుల నమోదు తగ్గడానికి ప్రధాన కారణాలు. **నిపుణులు పేర్కొంటున్న పలు అంశాలు.** ప్రభుత్వ పాఠశాలలపై తగ్గుతున్న సామాజిక నమ్మకం. ఇంగ్లీష్ మీడియం, కమ్యూనికేషన్ నైపుణ్యాల కోసం ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల కొరతతో బహుళ తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు బోధించే పరిస్థితులు. క్షేత్రస్థాయిలో నమోదు పెంపుపై పర్యవేక్షణ లోపించడం. **విద్యా నాణ్యతపై ప్రజల్లో విశ్వాసం కల్పించడంలో వైఫల్యం. ఉపాధ్యాయ వ్యవస్థపై కూడా ప్రశ్నలు** ప్రభుత్వం జీతాలు, పదోన్నతులు, సేవా భద్రత వంటి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ, ప్రతి ఉపాధ్యాయుడు తన పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచేందుకు, బోధన నాణ్యత మెరుగుపర్చేందుకు, తల్లిదండ్రుల్లో విశ్వాసం పెంచేందుకు ఎంత మేర కృషి చేస్తున్నారనే అంశంపై సమీక్ష జరగాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య నిరంతరం తగ్గుతున్నా బాధ్యులపై చర్యలు లేకపోవడం కూడా నిర్లక్ష్యానికి కారణమవుతోందని విమర్శలు ఉన్నాయి. **విద్యాశాఖ సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు** సింగిల్ డిజిట్‌కు చేరిన పాఠశాలలపై ప్రత్యేక విచారణ జరిగిందా..? నమోదు పెంపు కోసం తీసుకున్న చర్యల ఫలితాలు ఏమిటి, పనితీరు ఆధారంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై సమీక్ష జరుగుతోందా..? ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ఉందా..? విద్యార్థుల సంఖ్య నిరంతరం తగ్గుతున్న పాఠశాలలపై బాధ్యత ఎవరికి.? విద్యావేత్తల అభిప్రాయం ప్రకారం, నిధులు కేటాయించడం మాత్రమే ప్రభుత్వ విద్యను బలోపేతం చేయదు. ఫలితాలు చూపని వ్యవస్థపై బాధ్యతను నిర్ధారించి, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై, బాధ్యతలను విస్మరించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడే ప్రభుత్వ విద్యపై ప్రజల్లో విశ్వాసం పునరుద్ధరించబడుతుంది.ప్రభుత్వం వెచ్చిస్తున్న ప్రతి రూపాయి విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడేలా జిల్లా విద్యాశాఖ తక్షణమే సమగ్ర సమీక్ష నిర్వహించి, అవసరమైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటూ ప్రభుత్వ పాఠశాలలను తిరిగి ప్రజల మొదటి ఎంపికగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు, మేధావులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వ బడుల మనుగడ ప్రశ్నార్థకమే అవుతుందని అభిప్రాయపడుతున్నారు.

---

# జడల అంజయ్యకు శ్రమశక్తి అవార్డు ప్రధానం చేయాలి

- ప్రభుత్వానికి ప్రైవేట్ ఎలక్ట్రిషన్లు విన్నపం
- రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్నాసి బాలరాజు



**కల్లూరు, జులై 31 (పిసిడబ్ల్యూ న్యూస్)** :ప్రైవేట్ ఎలక్ట్రిషన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు, కార్మిక నాయకులు, జడల అంజయ్యకు రాష్ట్ర ప్రభుత్వం శ్రమశక్తి అవార్డు ప్రకటించాలని రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్నాశి బాలరాజు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఏర్పాటుచేసిన ప్రైవేట్ ఎలక్ట్రిషన్ల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించి ఉన్న లక్షలాది ఎలక్ట్రిషన్ కుటుంబాలు ఆత్మగౌరవంతో బ్రతికేందుకు 40 సంవత్సరాల క్రితం ఎలక్ట్రిషన్ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి పాటలు వేసిన కార్మిక పక్షపాతి జడల అంజయ్యకు శ్రమశక్తి అవార్డు స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రధానం చేసి వారిని ప్రైవేట్ ఎలక్ట్రిషన్ల సమాజపక్షంగా రాష్ట్ర ప్రభుత్వం గౌరవించాలని ఆయన కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మండల కేంద్రాల్లో ఉన్న కమిటీలు ప్రతి మండల తహసీల్దారులకు అంజయ్యకు శ్రమశక్తి అవార్డు ప్రధానం చేయాలని వినతి పత్రాలు అందించాలని కోరారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కమిటీలు జిల్లా కేంద్రాలలో జిల్లా కలెక్టర్లకు వినతి పత్రం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్కే హసీం షరీఫ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ అధ్యక్షులు ఎస్కే షరీఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి యు కుమార్, సీనియర్ ఎలక్ట్రీషియన్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

---

# క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పు

- హైపర్‌సైట్‌తో సైడ్ ఎఫెక్ట్స్ లేని వైద్యం
- రేడియేషన్ థెరపీలో గేమ్ ఛేంజర్‌గా మారిన అడాప్టివ్ థెరపీ
- 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ తప్పనిసరి
- యశోద హాస్పిటల్స్ ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ శ్రవంతి



**పెద్దపల్లి,జూలై 31 (పిసి డబ్ల్యూన్యూస్):** క్యాన్సర్ మహమ్మారిపై పోరులో వైద్య రంగం మరో మైలురాయిని దాటిందని,సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అత్యాధునిక 'హైపర్ సైట్ రేడియేషన్ థెరపీ అందుబాటులోకి తెచ్చినట్లు ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ శ్రవంతి తెలిపారు.శుక్రవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ శ్రవంతి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాప్తికి కారణాలు,ఆధునిక చికిత్స విధానాలపై వివరాలను వెల్లడించారు.సమాజంలో క్యాన్సర్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయని,దీనికి ప్రధాన కారణం మారుతున్న జీవనశైలి అని ఆమె పేర్కొన్నారు.పొగాకు నమలడం,ధూమపానం,కారమైన ఆహారాలు, కలుషితమైన తిండి,వ్యాయామం లేకపోవడం వంటి కారణాల వల్ల 70 నుంచి 80 శాతం క్యాన్సర్లు వస్తున్నాయని తెలిపారు.కేవలం 10 నుంచి 15 శాతం మాత్రమే జన్యుపరంగా కుటుంబంలో ఎవరికైనా ఉంటే వస్తాయని స్పష్టం చేశారు.క్యాన్సర్ చికిత్సలో సర్జరీ,కీమోథెరపీ,రేడియేషన్ థెరపీ,ఇమ్యునోథెరపీ వంటి పద్ధతులు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ శ్రవంతి తెలిపారు.అయితే ట్రీట్మెంట్ సమయంలో వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ వల్ల రోగులు మానసికంగా కుంగిపోకుండా,ఈ కొత్త అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ద్వారా సైడ్ ఎఫెక్ట్స్‌ను 50 నుంచి 60 శాతం వరకు తగ్గించవచ్చునని వెల్లడించారు.ప్రతిరోజూ ట్రీట్మెంట్ సమయంలో గడ్డ సైజులో వచ్చే మార్పులను,చుట్టుపక్కల ఉండే ఆర్గాన్స్ కదలికలను ఈ మిషన్ స్పష్టంగా గుర్తిస్తుందని,దీనివల్ల ఆరోగ్యకరమైన అవయవాలకు ఎలాంటి నష్టం వాటిలకుండా నేరుగా కణితిపైనే కచ్చితమైన రేడియేషన్ ఇవ్వవచ్చని, ఊపిరితిత్తులు లేదా ఛాతి భాగంలో శ్వాస తీసుకోవడం వల్ల కదిలే కణితులను కూడా బ్రీదింగ్ సైకిల్ ట్రాకింగ్ ద్వారా కచ్చితంగా గుర్తించి చికిత్స అందించవచ్చని తెలిపారు.పాతకాలపు మిషన్లతో పోలిస్తే ఇందులో ట్రీట్మెంట్ సమయం చాలా తక్కువగా ఉంటుందన్నారు.

రోగులు ఎక్కువసేపు శ్వాస బిగబట్టాల్సిన అవసరం లేకుండా తక్కువ సమయంలోనే చికిత్స పూర్తవుతుం దన్నారు.రోజూ మారుతున్న శరీర పరిస్థితులను బట్టి చికిత్సను అడాప్ట్ చేసుకునే అద్భుతమైన అవకాశం ఈ హైపర్ సైట్ ద్వారా లభిస్తుందని ఆమె వివరించారు.సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ తీసుకువచ్చిన ఈ హైపర్ సైట్ మిషన్ ఇమేజ్ గైడెడ్ రేడియో థెరపీలో ఒక విప్లవాత్మక మార్పు అని డాక్టర్ శ్రవంతి పేర్కొన్నారు.క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రాణాలను కాపాడుకోవాలని చేసుకోవాలని ఆమె తెలిపారు.ఈ సమావేశంలో పిఆర్వో లక్ష్మణరావు పాల్గొన్నారు

---

# ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలి

**ఆర్డీఓ కార్యాలయ ముట్టడికి బీసీ విద్యార్థి సంఘం యత్నం.. అడ్డుకున్న పోలీసులు**





**ఖమ్మం, ప్రతినిధి జూలై 31 (పిసిడబ్ల్యూన్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మంలో ఆర్డీఓ కార్యాలయ ముట్టడికి యత్నించారు. కాల్వొడ్డు నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ర్యాలీ పాత బస్టాండ్ ప్రాంతానికి చేరుకోగానే విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టడంతో కొంతసేపు భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అనంతరం ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్న విద్యార్థి నాయకులు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఆర్డీఓ కార్యాలయం నుంచి బయటకు వచ్చిన అధికారులు బీసీ విద్యార్థి సంఘం ప్రతినిధుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని, ఈ వినతిపత్రాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని విద్యార్థి సంఘం నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు రాకేష్ దత్త, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి భాషాబోయిన ఉపేందర్, టౌన్ అధ్యక్షుడు శీలం ఉపేందర్, ఆర్. ధర్మ, బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు సాయి హర్షిత్, బీసీ విద్యార్థి నాయకురాలు కావేరితో పాటు సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

---

# సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు సిగ్గుచేటు

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య**





**ఖమ్మం ప్రతినిధి, జూలై 31 (పీసీడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ సమాజ నిర్మాణంలో, ప్రాజెక్టుల రూపకల్పనలో కీలకపాత్ర పోషించిన ఇంజనీర్లను, యువతను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య మండిపడ్డారు. శుక్రవారం వారు ఓ ప్రకటనలో... రేవంత్ రెడ్డి ఇంజనీరింగ్ పట్టభద్రులకు జాబ్ అప్లికేషన్ రాయడం కూడా రాదని, వారి చదువు "క్రిమినల్ వేస్ట్" అని అనడం తెలంగాణ యువత నైపుణ్యాలను, వారి శ్రమను తీవ్రంగా అవమానించడమేనని ధ్వజమెత్తారు.**కెసిఆర్ పాలనలో ఇంజనీర్లకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం** ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కెసిఆర్ హయాంలో తెలంగాణ ఇంజనీర్లకు అందించిన సహకారాన్ని, కల్పించిన అవకాశాలను వారు గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో సీమాంధ్ర కాంట్రాక్టర్లు, ఇంజనీర్ల చేతిలో నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ ఇంజనీరింగ్ ప్రతిభను బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తించి, గౌరవించిందన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత నీటిపారుదల, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్అండ్ బి శాఖల్లో వేలాది మంది ఏఈ, ఏఈఈ ఖాళీలను పారదర్శకంగా భర్తీ చేసి తెలంగాణ యువ ఇంజనీర్లకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాం అన్నారు. కాళేశ్వరం వంటి కాళేశ్వర ఎత్తిపోతల పథకం, మిషన్ భగీరథ, యాదాద్రి పవర్ ప్లాంట్, కమాండ్ కంట్రోల్ సెంటర్ వంటి సంచలనాత్మక నిర్మాణాలు మన తెలంగాణ ఇంజనీర్ల ప్రతిభతోనే సాధ్యమయ్యాయి. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంచడానికి 'టాస్క్' ద్వారా వేలాది మందికి శిక్షణ నిచ్చి ఐటీ, ప్రాజెక్టు రంగాల్లో అవకాశాలు కల్పించాం అన్నారు.**రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలి :** విద్యార్థులకు, యువతకు భరోసా ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి స్థానంలో ఉండి, వారి చదువును 'వేస్ట్' అని సంబోధించడం ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. రాజకీయ ప్రయోజనాల కోసం ఇంజనీర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయవద్దని, విద్యార్థుల నైపుణ్యాలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని తెలంగాణ ఇంజనీరింగ్ రంగానికి క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

# ఒక ఆపరేషన్... నిండు జీవితానికి కొత్త ఊపిరి

**- 24 గంటలుగా కడుపునొప్పితో ప్రాణాపాయంలో ఉన్న యువకుడికి అత్యవసర శస్త్రచికిత్స చేసి ప్రాణం కాపాడిన ఎంఎస్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎ. మోహన్ వైద్య బృందానికి కుటుంబ సభ్యుల కృతజ్ఞతాభివందనం**



**ఖమ్మం ప్రతినిధి, జూలై 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** వైద్య వృత్తి కేవలం ఒక ఉద్యోగం కాదు... ప్రాణాలను కాపాడే మహోన్నత సేవ అనే మాటను మరోసారి నిజం చేశారు ఖమ్మంలోని సాయి మారుతి హాస్పిటల్‌కు చెందిన ఎంఎస్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎ. మోహన్. మరణంతో పోరాడుతున్న ఓ యువకుడికి సకాలంలో శస్త్రచికిత్స నిర్వహించి కొత్త జీవితాన్ని ప్రసాదించారు. ఖమ్మం నగరంలోని 40వ డివిజన్‌కు చెందిన, ఆవాజ్ వన్‌టౌన్ మైనారిటీ నాయకుడు షేక్ సాహెబ్ హుస్సేన్ గత 24 గంటలుగా తీవ్రమైన కడుపునొప్పితో తీవ్రంగా బాధపడుతున్నారు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం అత్యవసరంగా ఖమ్మంలోని సాయి మారుతి హాస్పిటల్‌కు తరలించారు. రోగి పరిస్థితిని గమనించిన ఆస్పత్రి మేనేజ్‌మెంట్ ప్రతినిధి రఫీ వెంటనే స్పందించి, డాక్టర్ ఎ. మోహన్‌కు సమాచారం అందించారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితిని అంచనా వేసిన డాక్టర్ మోహన్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా శస్త్రచికిత్సకు సిద్ధమయ్యారు. అపార అనుభవం, ఆత్మవిశ్వాసం, వైద్య నైపుణ్యంతో నిర్వహించిన ఆపరేషన్ విజయవంతమై, ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకుడు కోలుకునే దిశగా అడుగులు వేయడం కుటుంబ సభ్యుల్లో ఆనందాన్ని నింపింది. నైపుణ్యంతో చేసిన శస్త్రచికిత్స... ఒక కుటుంబానికి మళ్లీ చిరునవ్వును తీసుకొచ్చింది. ఒక ఆపరేషన్ నిండు జీవితాన్ని తిరిగి అందించింది" అని బంధువులు భావోద్వేగంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎ. మోహన్ కు, అలాగే సకాలంలో స్పందించి వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించిన ఆస్పత్రి మేనేజ్‌మెంట్ ప్రతినిధి రఫీకు రోగి కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "ప్రాణం కంటే విలువైనది మరొకటి లేదు... ఆ ప్రాణాన్ని కాపాడిన ప్రతి వైద్యుడు నిజంగా దేవుడితో సమానం" అనే భావనను ఈ సంఘటన మరోసారి చాటిచెప్పింది. డాక్టర్ మోహన్ అందించిన వైద్యసేవలను అభినందిస్తూ సీపీఎం వన్‌టౌన్ కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, టీఆర్ఎస్ మైనారిటీ నగర అధ్యక్షుడు శంషుద్దీన్, మైనారిటీ నాయకులు షేక్ సోనీ, షేక్ ఖాసిం, షేక్ సోహెల్, షేక్ మస్తాన్, షేక్ ఆఫీస్, గౌసియా తదితరులు వైద్య బృందాన్ని అభినందించి, రోగి త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు.

# గోదావరి ఉద్ధృతి.. ఏటూరునాగారంలో మూడో ప్రమాద హెచ్చరిక జారీ



**ఏటూరునాగారం, జూలై 31 (పిసిడబ్ల్యూన్యూస్):** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో గోదావరి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదావరి నీటిమట్టం శుక్రవారం రాత్రికి 17.32 మీటర్లకు చేరడంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నది నీటిమట్టం వేగంగా పెరుగుతుండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులు సూచించారు. గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు నదిలోకి వెళ్లరాదని, వరద ప్రవాహాన్ని చూసేందుకు నది ఒడ్డుకు చేరుకోవద్దని హెచ్చరించారు. ఇప్పటికే ఏజెన్సీ ప్రాంతంలోని వెంకటాపురం, వాజేడు, మంగపేట, ఏటూరునాగారం మండలాల్లో గోదావరి వరద ప్రభావం కనిపిస్తోంది. పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, రెవెన్యూ, పోలీసు, విపత్తు నిర్వహణ శాఖల సిబ్బందిని అప్రమత్తం చేశారు. వరద పరిస్థితులు మరింత ఉద్ధృతమయ్యే అవకాశం ఉండటంతో ప్రజలు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# 22వ డివిజన్‌లో మహాశక్తి స్టీల్ బ్యాంక్ ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**ప్లాస్టిక్‌కు బదులుగా స్టీల్ వినియోగాన్ని ప్రోత్సహించాలి మేయర్**



**కరీంనగర్ జూలై 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని 22వ డివిజన్‌లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే లక్ష్యంతో ఏర్పాటు చేసి మహాశక్తి స్టీల్ బ్యాంక్ ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని, అందువల్ల ప్రజలు ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా స్టీల్ పాత్రలను వినియోగించే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. సమాజంలో పర్యావరణహిత జీవన విధానాన్ని ప్రోత్సహించేందుకు మహాశక్తి స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. 22వ డివిజన్‌లో జరిగే వివాహాలు, శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాల్లో ప్లాస్టిక్ పాత్రల వినియోగాన్ని పూర్తిగా నివారించే ఉద్దేశంతో 1000 స్టీల్ ప్లేట్లు, 200 స్టీల్ గ్లాసులతో కూడిన స్టీల్ బ్యాంక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఈ స్టీల్ పాత్రలను డివిజన్‌లోని ప్రజలకు శుభకార్యాల సందర్భాల్లో ఉచితంగా అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచి ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని మేయర్ అన్నారు. నగరంలో స్వచ్ఛతతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బండ రమణారెడ్డి, బొడ్ల కృష్ణ, పెద్ది శ్రీనివాస్, తిరుమల్ రెడ్డి, శ్రీకాంత్, వేణుగోపాల్, రాజశేఖర్ రెడ్డి, మల్లారెడ్డి, కొండలరావు, ప్రభాకర్ రెడ్డి, శ్రీధర్, రవి, సంతోష్ రెడ్డి, మధు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# టీఎన్జీవోఎస్ ఆధ్వర్యంలో కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్‌కు ఘన సన్మానం



**కరీంనగర్ జిల్లా జూలై 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** టీఎన్జీవోఎస్ (తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘం) ఆహ్వానం మేరకు కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ టీఎన్జీవోఎస్ జిల్లా కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోఎస్ నాయకులు, సభ్యులు మేయర్ గారిని శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. నగరాభివృద్ధికి మేయర్ కొలగాని శ్రీనివాస్ చేస్తున్న సేవలను టీఎన్జీవోఎస్ నాయకులు అభినందించారు. ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, పచ్చదనం వంటి అంశాల్లో మేయర్ తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, టీఎన్జీవోఎస్ సభ్యులు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పరస్పర సహకారంతో పనిచేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి లక్ష్మణరావు, కిరణ్, అభేందర్ సింగ్, సందీప్ రాజేష్, రఘుతం రెడ్డి, అమరేందర్ రెడ్డి, పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు బొంకూరు శంకర్, మామిడి రమేష్, మరియు కరీంనగర్ జిల్లా నాయకులు, కార్యవర్గ సభ్యులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

# మానేరు తీరంలోని ఫిల్టర్ బెడ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**తాగునీటి సరఫరాలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి అధికారులకు మేయర్ ఆదేశాలు**





**కరీంనగర్ జిల్లా జూలై 31(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని మానేరు తీరంలో ఉన్న ఫిల్టర్ బెడ్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగర ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటి శుద్ధి ప్రక్రియ, ఫిల్టర్ బెడ్ నిర్వహణ, యంత్రాల పనితీరు, నీటి నిల్వలు, పరిశుభ్రత తదితర అంశాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగర ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగునీటిని అందించడం నగరపాలక సంస్థ ప్రధాన బాధ్యత అని అన్నారు. తాగునీటి శుద్ధి ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా, నీటి నాణ్యతను నిరంతరం పరీక్షిస్తూ ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిల్టర్ బెడ్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన మరమ్మతులు మరియు నిర్వహణ పనులను వెంటనే చేపట్టాలని సూచించారు. నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మేయర్ స్పష్టం చేశారు. మేయర్ వెంట డిఈ దేవేందర్ రెడ్డి, మున్సిపల్ ఇంజినీరింగ్ మరియు వాటర్ సప్లై విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తహాఫుజ్ ఖత్మే నబువ్వత్‌ను సమాజంలో బలోపేతం చేయండి

**ఇస్లాం ముసుగులో సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలపై అప్రమత్తంగా ఉండండి**

**ఖాధియాని, షకిలియత్ వర్గాల బారిన పడి మోసపోకండి..**

**గ్రామీణ ప్రాంత ముస్లింల ఈమాన్ విశ్వాసాన్ని కాపాడే యజ్ఞంలో బాగస్వామ్యులు కండి**

**ముస్లిం సమాజానికి మౌలానా అర్షద్ అలీ ఖాస్మి పిలుపు**



**కరీంనగర్, జూలై 31(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రస్తుత పరిస్థితుల్లో ఖాధియాని, షకిలియత్ వర్గాల నుంచి ముస్లిం సమాజాన్ని మేలుకొలుపి, వారి బారి నుండి కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఉమ్మతే మహమ్మదీయా (మహమ్మద్ ప్రవక్త సల్లం అనుచరులపై) ఉందని మజ్లీస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ ట్రస్టు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి మౌలానా అర్షద్ అలీ ఖాస్మి పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా మజ్లీస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్టు అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్ ఆధ్వర్యంలో కశ్మీర్ గడ్డ మస్జిదే జంజంలో నిర్వహించిన ఇస్ దౌర్ మే బాతిల్ ఫిత్నోసే అప్నే ఈమాన్ కో కైసే బచాయే అనే అంశంపై నిర్వహించిన జల్సా ఆధ్యాత్మిక సదస్సు పెద్దఎత్తున విజయవంతం అయింది. ఈసందర్భంగా మౌలానా అర్షద్ అలీ ఖాస్మి మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్తను చిట్ట చివరి ప్రవక్తగా అంగీకరించకుంటే ముస్లిం కాలేడని, విశ్వాసం ఈమాన్ నుండి బహిష్కృతులు అవుతారని చెప్పారు. ఇజ్రాయిల్, ఆంగ్లేయుల కనుసన్నల్లో భారత దేశంలో ఖాధియాని వర్గం పేరిట, షకిల్ వర్గం పేరిట కార్యకలాపాలను కొనసాగిస్తూ, ముస్లింల ముసుగులో, వేషధారణలతో అమాయక ముస్లింలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ముస్లిం యువత ఇస్లాం గురించి పూర్తి స్థాయిలో తెలియకుండా ఖాధియాని, షకిలియత్ వర్గాలు ముస్లిం గురువులు, పండితులని నమ్మి, వారిబారిన పడి, ఇస్లాం, ఈమాన్ నుండి తమంతట తాము బహిష్కృతులు అవుతున్నారని, ఇంత పెద్ద ఘటన ఇది వీరికి తెలియకుండానే జరిగిపోతుందన్నారు. ఖాధియాని, షకిలియత్ వర్గాలను స్వీకరించి, వారు చెప్పిన బాటలో నడుస్తూ జీవితం గడిపి, ఒకవేళ మరణిస్తే కాఫీర్ గానే పరిగణించబడుతారని, ఖయామత్ ప్రళయదినం రోజు లేపబడుతారని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ముస్లింలను చేరదీసి, వారి ఈమాన్ విశ్వసాన్ని కాపాడేందుకు మజ్లీస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్టు చేస్తున్న ఈ బృహత్తర యజ్ఞంలో ప్రతి ఒక్కరూ తమ విధిగా, బాధ్యతతో పాలుపంచుకొని, తోడ్పాటునందించాలని కోరారు. ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో అలుపెరుగకుండా గ్రామీణ ప్రాంతాల్లో ముస్లింల, ఈమాన్, విశ్వసాన్ని కాపాడేందుకు కృషి చేస్తున్నారని అభినందించారు. ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ కు కరీంనగర్ నగర ముస్లిం సమాజం అండగా నిలబడి, మజ్లీస్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్టు లో తమ అమూల్యమైన సమయాన్ని వెచ్చించి, అమాయక గ్రామీణ ముస్లింలను ఇస్లాం నుండి మరలిపోకుండా కాపాడే యజ్ఞంలో మహమ్మద్ ప్రవక్త అనుచరులుగా మనసా, వాచా, ఖర్మనా సేవలు అందించాలని పిలుపు నిచ్చారు. ఈసదస్సుకు ఉమ్మడి జిల్లా నుండి, నగర ఇస్లామీయ ధార్మిక పండితులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేశారు. ఈకార్యక్రమంలో హాఫీజ్ వసిముద్దీన్, ఖత్మే నబువ్వత్ కరీంనగర్ సేవకులు హాఫిజ్ అహ్మద్ హిఫ్జి, కలిమ్ షరీఫ్, హాఫిజ్ అబ్దుల్ రాఫె, హాఫిజ్ తౌహీద్, హాఫీజ్ ఇమ్రాన్ బేగ్, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు

# పొట్టి శ్రీరాములు చౌరస్తాలో నూతన హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**నగర సౌందర్యంతో పాటు రహదారి భద్రతకు ఆధునిక లైటింగ్ వ్యవస్థలు దోహదం చేస్తాయి మేయర్**



**కరీంనగర్ జిల్లా జూలై 31(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని పొట్టి శ్రీరాములు చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఆధునిక లైటింగ్ వ్యవస్థను పరిశీలించిన మేయర్, నగరంలో ప్రధాన కూడళ్లను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు రాత్రి వేళల్లో ప్రజలకు మెరుగైన వెలుతురు సౌకర్యం కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. మేయర్ మాట్లాడుతూ, నగర సౌందర్యాన్ని పెంపొందించడంతో పాటు రహదారి భద్రతను మెరుగుపర్చేందుకు ఆధునిక లైటింగ్ వ్యవస్థలను దశలవారీగా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రజలకు సౌకర్యవంతమైన, సురక్షితమైన పట్టణ వాతావరణాన్ని కల్పించేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వంగల పవన్ కుమార్, కో-ఆప్షన్ సభ్యులు కన్న కృష్ణ, నందకు మార్, నాయకులు గాజ శివరాం, ఎండి ముజీబ్, తనకు సాయి కృష్ణ, సొల్లు అజయ్ వర్మ, వరాల జ్యోతి, కైలాస నవీన్, కొడిత్యాల సురేష్ పాల్గొన్నారు.

# కొండగట్టు గిరిప్రదక్షిణ ఫలితమే సమృద్ధి వర్షాలు - బిఆర్ఎస్ హేళనకు చెంపపెట్టు: మేడిపల్లి సత్యం

**● వర్షాలతో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి - కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే ● 2023 తర్వాత బిఆర్ఎస్ ఒక ముగిసిన అధ్యాయం - ప్రజలు ఆ పార్టీని మర్చిపోయారు ● శ్రీపాద ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్ వల్లే నేడు తెలంగాణకు నీళ్లు - కాళేశ్వరం ఆఫ్టర్ ఫ్లాప్ ● రెండున్నర ఏళ్లుగా కన్నేపల్లి పంపు లేకుండానే నీళ్లు ఇస్తున్నాం ● సమృద్ధి వర్షాలతో రైతులు సంతోషంగా దుక్కి దున్నుతున్నారు - రైతాంగానికి శుభాకాంక్షలు ● చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా.మేడిపల్లి సత్యం.**




**కరీంనగర్ జూలై 31(పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లా వ్యాప్తంగా రెండు మూడు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ప్రజలకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా ఎరువుల పంపిణీ, గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గారిని కలిసి కోరడం జరిగింది..సానుకూలంగా స్పందించిన కలెక్టర్ జిల్లా యంత్రాంగంలోని అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది.అనంతరం మీడియాను ఉద్దేశించి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులందరూ సంతోషంగా ఉన్నారు ఎల్ ని నో ప్రభావంతో కరువు వస్తుందని ఆందోళన పడ్డ రైతులు ఇప్పుడు సంతోషంగా దుక్కి దున్నుకుంటూ నాట్లు వేస్తున్నారు ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము, ఈసారి కరువుతో కాంగ్రెస్ పార్టీ పని అయిపోతుందని రైతులను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుదామని మొన్నటి వరకు బిఆర్ఎస్ నేతలు కలలు కన్నారు ఆ కలలు అన్నింటినీ వమ్ము చేస్తూ భగవంతుని ఆశీర్వాదంతో వరుణుడు కరుణించి పుష్కలంగా వర్షాలు పడుతున్నాయి ఈ వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవుడు అనుగ్రహించడం శుభ పరిణామం. ఎంతసేపు ఈ రాష్ట్రంలో వర్షాలు పడద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవాలని బిఆర్ఎస్ నేతలు ఏడుపుగొట్టు రాజకీయాలు చేశారు. బిఆర్ఎస్ నేతల చెంప చెల్లుమనిపించేలా సకాలంలో వర్షాలు పడటం రైతులకు ఎంతో ఉపశమనం కలిగించాయి. ప్రపంచంలోనే గొప్ప ప్రాజెక్టు కట్టామని బిఆర్ఎస్ నేతలు చెప్పుకుంటున్న కాళేశ్వరం ప్రాజెక్టు కుంగి పోయిన రెండున్నర సంవత్సరాల నుండి కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధం లేకుండానే నీళ్లు ఇవ్వడం జరిగింది. దేశంలో ఏ రాష్ట్రంలో పండని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పండిన వరి పంటతో మొదటి స్థానంలో ఉంది వేల కోట్ల రూపాయల ఖర్చు పెట్టి బిఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టులు ఎందుకు పనికి రకుండా పడావు బడ్డాయి కాంగ్రెస్ పార్టీ కట్టిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నేడు తెలంగాణ రాష్ట్రానికి జీవాధారం అయింది. కాళేశ్వరం ఒక ఆఫ్టర్ ఫ్లాప్, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కట్టిన శ్రీపాద ఎల్లంపల్లి శ్రీరాంసాగర్ వరద కాలువ నేడు తెలంగాణ రైతాంగానికి ఉపయోగపడుతున్నాయి.. కన్నేపల్లి పంపు ఆన్ చేయకుండానే రెండున్నర సంవత్సరాలుగా నిలుస్తున్నాము ఇంకా ఇస్తాము, గత ప్రభుత్వం కట్టిన ఏ ప్రాజెక్టుతోను ఎలాంటి ప్రయోజనం లేదు.. ఇంత జరుగుతుంటే సిగ్గు లేకుండా మా వల్లే వర్షాలు పడ్డాయని బి ఆర్ ఎస్ నేతలు ప్రగల్భాలు పలుకుతున్నారు.కొండగట్టు అంజన్న ఆశీర్వాదంతో జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని గట్టిగా మొన్న మేము కొండగట్టు మహా గిరి ప్రదక్షిణ చేయడం జరిగింది..దానిని కూడా హేళన చేస్తూ గిరి ప్రదక్షిణ చేస్తే వర్షాలు వస్తాయా. నడిస్తే వర్షాలు పడతాయి అంటూ బిఆర్ఎస్ నేతలు దొంగ ధర్నాలు చేశారు. మేము ఖచ్చితంగా చెప్తాం..మేము కొండగట్టు గిరి ప్రదక్షిణ చేయడం వల్లనే వర్షాలు పడ్డాయి.ఒక మంచి ఆలోచనతో ప్రయత్నం చేస్తే దేవుడు కరుణిస్తాడు, ప్రకృతి కూడా సహకరిస్తుంది, తెలంగాణ ప్రజల నాశనాన్ని కోరుకునే బిఆర్ఎస్ నేతలు స్పైడర్ సినిమాలో విలన్ సూర్య ఎవరైనా చనిపోతే ఆ ఏడుపులు విని సంతోషపడతాడు ఆ క్యారెక్టర్ రోల్ పోషిస్తూ సైకో శాడిస్ట్ లాగా బిఆర్ఎస్ నేతలు ప్రవర్తిస్తున్నారు. 2023 తర్వాత ఈ రాష్ట్రంలో బిఆర్ఎస్ ఒక ముగిసిన అధ్యాయం, 2023 సాధారణ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బిఆర్ఎస్ పార్టీని ప్రతిపక్షానికి పరిమితం చేశారు. 14 సంవత్సరాలు ఉద్యమం చేసిన పార్టీకి, 9 సంవత్సరాలు ఈ రాష్ట్రాన్ని ఏలిన పార్టీకి పార్లమెంటు ఎన్నికల్లో గుండు సున్నా ఇచ్చారు. పంచాయతీ మున్సిపల్ ఎన్నికల్లో పత్తా లేకుండా చేశారు.జూబ్లీహిల్స్ కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ స్థానాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి భ్రమరథం పట్టారు. ఈ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ అవసరం లేదు, ఆ పార్టీ నాయకులు అవసరం లేదు, ఆ పార్టీని ప్రజలు మర్చిపోయారు.జరిగిన అన్ని ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా దోచుకున్న వేల కోట్లతో బిఆర్ఎస్ నేతలు కొన్ని యూట్యూబ్ ఛానెల్స్ ను అడ్డుపెట్టుకొని చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.కలెక్టర్ ను కలిసిన వారిలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పురుమల్ల మనోహర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యం శంకర్, తదితరులు ఉన్నారు.

# సేవామూర్తి రాఘవరావుకు కన్నీటి వీడ్కోలు..

**స్ఫూర్తి వాకర్స్ ఘన నివాళి**

**సాహితీ విద్యా సేవ, సమాజసేవ, పర్యావరణ పరిరక్షణలో చెరగని ముద్ర వేసిన మహనీయుడిని స్మరించుకున్న వాకర్స్**

**“వ్యక్తి దూరమైనా.. ఆయన విలువలు చిరంజీవులే“**





ఖమ్మం ప్రతినిధి, జూలై 31 (పీసీడబ్ల్యూ న్యూస్) : అక్షరానికి ఊపిరి పోసిన విద్యావేత్త, ప్రకృతికి ప్రాణమిచ్చిన మానవతావాది, సాహితీ విద్యాసంస్థల అధినేత, స్ఫూర్తి వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రాఘవరావు భౌతిక దూరం ఖమ్మం నగరాన్ని శోకసంద్రంలో ముంచెత్తింది. స్ఫూర్తి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనకు అత్యంత భావోద్వేగభరిత వాతావరణంలో ఘనమైన నివాళులర్పించారు. స్ఫూర్తి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వై. శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సంతాపసభలో పలువురు ప్రముఖులు పాల్గొని రాఘవరావు అందించిన సేవలను హృదయపూర్వకంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బండి రమేష్, మాజీ కార్పొరేటర్ బుర్రి వెంకట్ కుమార్ మాట్లాడుతూ... “మనం ఈ రోజు భారమైన హృదయంతో సమావేశమైనప్పటికీ, రాఘవరావు వంటి మహోన్నత వ్యక్తి జీవితాన్ని గుర్తు చేసుకోవడం మన అదృష్టం. ఆయన కేవలం ఒక విద్యాసంస్థల అధినేత మాత్రమే కాదు... సేవకు ప్రతిరూపం, సాహిత్యానికి అభిమాని, సమాజానికి మార్గదర్శి“ అని కొనియాడారు.రాఘవరావు తన హోదాలతో కాకుండా, తన నిరాడంబర జీవనశైలి, ఆప్యాయత, సహృదయత, సేవాభావంతో ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేశారని వారు పేర్కొన్నారు. ఆయనను ఒక్కసారి కలిసిన వారెవరైనా ఆయన చిరునవ్వును, ఆత్మీయ పలకరింపును జీవితాంతం మరచిపోలేరని అన్నారు.ముఖ్యంగా వాకర్స్ గ్రౌండ్ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని గుర్తుచేశారు. నడకకు మాత్రమే పరిమితం కాకుండా, ప్రకృతి ఒడిలో ప్రశాంతతను ఆస్వాదించే పచ్చని వాతావరణంగా వాకర్స్ గ్రౌండ్‌ను తీర్చిదిద్దాలనే ఆయన సంకల్పం నేటికీ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి ప్రేమ, సమాజ శ్రేయస్సు ఆయన జీవన విధానంలో అంతర్భాగాలని కొనియాడారు.“మనిషి శరీరంగా దూరమైనా... అతడు చేసిన మంచి పనులు, సమాజానికి అందించిన విలువలు ఎన్నటికీ మరణించవు. రాఘవరావు ది అలాంటి చిరస్మరణీయ వ్యక్తిత్వం. ఆయన చూపిన సేవా మార్గం భావితరాలకు స్ఫూర్తిదాయకం“ అని సభలో పలువురు భావోద్వేగంతో నివాళులర్పించారు. “సేవతో జీవించినవారు శరీరంగా దూరమైనా... సమాజం గుండెల్లో చిరకాలం జీవిస్తారు. రాఘవరావు జీవితం అలాంటి స్ఫూర్తిదాయకమైన ప్రయాణమే“ అని సభలో పాల్గొన్నవారు భావోద్వేగంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోదండరామిరెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, సీసీ, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, దయానందరావు, ప్రభాకర్, రవి, కోటేశ్వరరావు, కామేశ్వరరావు, శ్రీనివాసరావు, సుదర్శన్, మేడ వెంకటేశ్వర్లు, కొల్లు హనుమంతరావు, పవన్, రాఘవరావు కుటుంబ సభ్యులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పాల్గొని పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.

# తెలంగాణలో మెరుగ్గా ఆయుష్ వైద్య సేవలు

**● లోక్‌సభలో ఖమ్మం ఎంపీ రాసహాయం రఘురాంరెడ్డి ప్రశ్నకు వివరాలు వెల్లడించిన కేంద్రం**



**ఖమ్మం ప్రతినిధి, జూలై 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలో ఆయుష్ వైద్య సేవలు గ్రామీణ ప్రజలకు విస్తృతంగా అందుతున్నాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. శుక్రవారం లోక్‌సభలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రాసహాయం రఘురాం రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్ వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో జాతీయ ఆయుష్ మిషన్ కింద మంజూరైన అన్ని కేంద్రాలు పూర్తి స్థాయిలో సేవలు అందిస్తున్నాయన్నారు. **తెలంగాణలో ఆయుష్ కేంద్రాల స్థితిగతులు** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ ఆయుష్ మిషన్ కింద మొత్తం 421 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్రాలు మంజూరు కాగా.. పూర్తి స్థాయిలో సేవలు అందిస్తున్నాయన్నారు. తెలంగాణలోని ఆయుష్ కేంద్రాల్లో వైద్య సేవలు పొందిన రోగుల సంఖ్య కేంద్రం విడుదల చేసిన అధికారిక నివేదిక ప్రకారం 2021లో 38,33,738 మంది రోగులు చికిత్స పోందారని తెలిపారు. 2022లో 23,58,802మంది, 2023లో29,13,265 మంది, 2024లో 20,61,093 మంది, 2025లో 18,58,894 మంది ఐదేళ్లలో మొత్తం 1,30,25,792 మంది తెలంగాణ ప్రజలు ఈ ఆయుష్ వైద్య కేంద్రాల ద్వారా సేవలు పొందారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు..అల్లోపతితో పాటు ఆయుర్వేద, యోగ, యునాని, సిద్ధ, హోమియోపతి (ఆయుష్) వైద్య విధానాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.

# దోమల నివారణకు ప్రత్యేక ఫాగింగ్ కార్యక్రమం: కార్పొరేటర్ మొహమ్మద్ మజీద్ హుస్సేన్..



**కరీంనగర్ జూలై 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** నగర ప్రజలను దోమల బెడద నుంచి రక్షించడంతో పాటు, దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులను నివారించే లక్ష్యంతో ఈరోజు కార్పొరేటర్ మొహమ్మద్ మజీద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఆయన డివిజన్‌లో ప్రత్యేక ఫాగింగ్ కార్యక్రమం నిర్వహించారు.డివిజన్‌లోని పలు కాలనీలు, వీధుల్లో ఫాగింగ్ యంత్రాలతో దోమల నివారణ చర్యలు చేపట్టారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కార్పొరేటర్ సూచించారు.ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, దోమల నివారణ చర్యలను నిరంతరం కొనసాగిస్తామని ఎఐఎంఐఎం కార్పొరేటర్ మొహమ్మద్ మజీద్ హుస్సేన్ తెలిపారు.





## పెద్ది సుదర్శన్ రెడ్డి మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది

**- వారి ఆత్మ శాంతి కావాలని సానుభూతి తెలిపిన మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ ప్రవీణ్ రావు**

పెద్దవంగర, జూలై 31 (పిసిడబ్ల్యూ న్యూస్):
తెలంగాణ రాష్ట్ర సాధకుడు, ఉద్యమ నేత నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ నెమరుగొమ్ముల ప్రవీణ్ రావు అన్నారు. 2021 వ సంవత్సరంలో నల్లబెల్లి మండల జడ్పీటిసిగా ఎన్నికై వరంగల్ జిల్లా జడ్పీ ఫ్లోర్ లీడర్ గా, నేను కొడకండ్ల మండల జడ్పీటిసిగా ఎన్నికై వరంగల్ జిల్లా జడ్పీ ఫ్లోర్ లీడర్ గా ఇద్దరం ఎంతో సన్నిహితంగా ఐదేళ్లు పనిచేశామని, పెద్ది సుదర్శన్ రెడ్డి లాంటి మచ్చలేని నాయకుడు ఉద్యమమే ఊపిరిగా రాష్ట్ర సాధనే లక్ష్యంగా నడిచారని, పెద్ది సుదర్శన్ రెడ్డిలో ఎంతో ఓర్పు, సహనం స్నేహభావం ఉండేదని అటువంటి వ్యక్తి మరణించడం నర్సంపేట ప్రజలకు తీరని లోటు అని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# సైమా 2026: నామినేషన్లలో 'మిరాయ్' హవా..

## ఏకంగా 11 విభాగాల్లో పోటీ!

ప్రతిష్ఠాత్మక సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ (సైమా)-2026కు సంబంధించిన నామినేషన్ల జాబితా విడుదలైంది. దక్షిణాది చలనచిత్ర పరిశ్రమలో అత్యంత గౌరవప్రదంగా భావించే ఈ అవార్డుల కోసం సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నిన్న సైమా కమిటీ ఈ నామినేషన్ల జాబితాను అధికారికంగా ప్రకటించింది. ఈసారి తెలుగు విభాగంలో తేజ సజ్జ కథానాయకుడిగా నటించిన 'మిరాయ్' చిత్రం ఏకంగా 11 విభాగాల్లో నామినేషన్లు దక్కించుకుని అగ్రస్థానంలో నిలిచింది. 2025 జనవరి నుంచి డిసెంబర్ మధ్య సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాలను ఈ అవార్డుల కోసం పరిగణనలోకి తీసుకున్నారు.

గతేడాది విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన 'మిరాయ్' చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.140 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి సంచలనం సృష్టించింది. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో యాక్షన్ అడ్వెంచర్ చిత్రంగా తెరకెక్కిన ఈ సినిమాలో మంచు మనోజ్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించి మెప్పించారు. ఇప్పుడు సైమాలో అత్యధిక నామినేషన్లు సాధించి మరోసారి తన సత్తా చాటుకుంది.

'మిరాయ్' తర్వాతి స్థానంలో 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం 10 కేటగిరీల్లో నామినేషన్లు సాధించి గట్టి పోటీ ఇస్తోంది. 2025 సంక్రాంతికి విడుదలై కుటుంబ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న ఈ చిత్రం రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో నటించగా, అనిల్ రావిపూడి తనదైన శైలిలో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా దీన్ని రూపొందించారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ ఈ చిత్రంలో ముఖ్య పాత్రలు పోషించారు.




వీటితో పాటు అక్కినేని నాగచైతన్య కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన 'తండేల్', మరో చిత్రం 'కోర్ట్' చెరో 9 నామినేషన్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. వాస్తవ సంఘటనల ఆధారంగా చందు మొండేటి దర్శకత్వంలో తెరకెక్కిన 'తండేల్' చిత్రంలో నాగచైతన్య సరసన సాయి పల్లవి నటించారు. ఈ చిత్రం నాగచైతన్య కెరీర్‌లో తొలి వంద కోట్ల సినిమాగా రికార్డు సృష్టించింది.

ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సెప్టెంబర్ 11, 12 తేదీల్లో అట్టహాసంగా జరగనుంది. 2025 సంవత్సరంలో తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విశేష ప్రతిభ కనబరిచిన నటీనటులు, దర్శకులు, సంగీత దర్శకులు, ఇతర సాంకేతిక నిపుణులకు ఈ పురస్కారాలు అందజేయనున్నారు. దీంతో ఏయే చిత్రాలకు, ఏయే నటీనటులకు అవార్డులు వస్తాయనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# ఉత్కంఠ పెంచుతున్న 'అగధ'..

## ట్రైలర్ విడుదలకు ముహూర్తం ఖరారు




ప్రముఖ ఫిలింమేకర్ ఎం.ఎస్. రాజు దర్శకత్వంలో రూపొందుతున్న మిస్టిక్ డివైన్ థ్రిల్లర్ 'అగధ'. ఇప్పటికే విడుదలైన టీజర్, పోస్టర్లతో ప్రేక్షకులలో భారీ అంచనాలను క్రియేట్ చేసిన ఈ సినిమా నుంచి మరో కీలక అప్‌డేట్ వచ్చింది. సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను ఆగస్టు 3వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.

ఈ సందర్భంగా ఓ కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. దట్టమైన అడవిలో ఓ స్త్రీ సాధువు నిలబడి ఉన్న ఈ పోస్టర్, సినిమాలోని ఆధ్యాత్మిక, రహస్యభరితమైన అంశాలపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ పోస్టర్ సినిమాపై ఉన్న ఉత్కంఠను రెట్టింపు చేసింది. టీజర్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన 'అగధ' ఇప్పుడు ట్రైలర్‌తో అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లడం ఖాయమని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ ఎల్‌ఎల్ పీ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, అజయ్ కె.ఆర్. సమర్పిస్తున్నారు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఏకకాలంలో రూపొందుతున్న ఈ చిత్రం ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్, సిజ్జు, రోషన్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి రాకేష్ వెంకటాపురం సంగీతం అందించగా, నాని చమిడిశెట్టి సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహించారు.

# ఆద్యంతం అలరించే యాక్షన్ థ్రిల్లర్ ట్రైలర్



దుల్కర్ సల్మాన్ ప్రతిష్టాత్మక చిత్రం 'ఐ యామ్ గేమ్' ట్రైలర్ విడుదలైంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ ట్రైలర్ ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో స్పెషల్ పోస్ట్ పెట్టారు. "ఐయామ్ గేమ్ ట్రైలర్‌లోని ఆ ఫైరీ వైబ్ నాకు బాగా నచ్చింది. మొదటి నుంచి చివరి వరకు ఎంతో గ్రిప్పింగ్‌గా, ఎంగేజింగ్‌గా సాగింది. నా సోదరుడు దుల్కర్ మరో స్పెషల్ మూవీతో వస్తున్నారని నమ్మకం కలిగింది. తనకి మంచి ఫలితాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను. అతనితో పాటు మొత్తం చిత్ర బృందానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు"అని ట్వీట్ చేశారు. ప్రేక్షకులు, అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం 2026 ఆగస్టు 20న ఓణం కానుకగా మలయాళం, తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో పాన్ ఇండియా చిత్రంగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. దుల్కర్ సల్మాన్ వేఫేరర్ ఫిలమ్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ భారీ బడ్జెట్ ఫాంటసీ థ్రిల్లర్, ఆయన కెరీర్‌లోనే అత్యంత భారీ చిత్రంగా రూపొందుతోంది. ఈ చిత్రానికి నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తున్నారు. దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ వేఫేరర్ ఫిలమ్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాజిర్ బాబా, ఇస్మాయిల్ అబూబక్కర్, బిలాల్ మొయిదు స్క్రీన్‌ప్లే అందించగా, సాజిర్ బాబా, ఆదర్శ్ సుకుమారన్, షబాస్ రషీద్ సంభాషణలు రాశారు.

# స్పోర్ట్స్ డ్రామాతో నందమూరి తేజస్విని ఎంట్రీ?:



ప్రముఖ సినీ నటుడు, టీడీపీ హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్విని త్వరలోనే వెండితెరకు పరిచయం కాబోతున్నారనే వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో, ఫిల్మ్‌నగర్ వర్గాల్లో హల్‌చల్ చేస్తోంది. అయితే, సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, ఒక ప్రయోగాత్మకమైన, యువతకు స్ఫూర్తినిచ్చే స్పోర్ట్స్ డ్రామా ద్వారా ఆమె ఎంట్రీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన కథా చర్చలు శరవేగంగా జరుగుతున్నాయని, అన్ని అంశాలు కుదిరితే త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే 'అన్‌స్టాపబుల్' టాక్ షోకు క్రియేటివ్ హెడ్‌గా, పలు సినిమాలకు నిర్మాణ భాగస్వామిగా వ్యవహరించిన తేజస్విని... ఇప్పుడు నేరుగా నటిగా మారనున్నారనే వార్తలతో నందమూరి అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మోక్షజ్ఞ కంటే ముందే ఆమె సందేశాత్మక చిత్రంతో వెండితెరపై మెరవబోతుండటం సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

# మొదటి సినిమా కష్టాలు..

## ఇప్పుడు స్టార్ హీరోయిన్ రేస్‌లో రితిక!

విశ్వక్సేన్ హీరోగా వచ్చిన 'అశోక వనంలో అర్జున కళ్యాణం' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది భామ రితిక నాయక్. తొలి సినిమాలోనే తన నటనతో ఆకట్టుకున్న ఈ బ్యూటీ, ప్రమోషన్ల సమయంలో పడిన బాధను ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పంచుకుంది. కానీ అప్పుడు చూపించిన సహనమే ఇప్పుడు ఆమెకు బ్యాక్-టు-బ్యాక్ ఆఫర్లను తెచ్చిపెట్టింది. ప్రస్తుతం బాక్సాఫీస్ హిట్లు సాధిస్తూ టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ల జాబితాలో చేరిపోతోంది.



'అశోక వనంలో అర్జున కళ్యాణం' రిలీజ్‌కు ముందు రుక్సర్ ధిల్లాన్‌నే ప్రధాన హీరోయిన్‌గా చూపించారు. సర్ ప్రైజ్ కోసం రితిక పాత్రను టీమ్ వ్యూహాత్మకంగా దాచి ఉంచింది. ప్రమోషన్లలో ఎక్కడా ఆమె కనిపించలేదు. లేక లేక వచ్చిన మొదటి సినిమా ప్రమోషన్లలో తను లేకపోవడంతో చాలా బాధపడ్డానని, ఫ్రెండ్‌కు ఫోన్ చేసి ఏడ్చానని రితిక తాజాగా గుర్తుచేసుకుంది. సీన్ రివర్స్.. అదిరిపోయిన ఎలివేషన్: సినిమా థియేటర్లలోకి వచ్చాక అసలైన మ్యాజిక్ జరిగింది. సినిమాలో క్రమంగా రితిక పాత్రే హైలైట్ అవుతూ వెళ్లింది. క్లైమాక్స్ వచ్చేసరికి ఆమె క్యారెక్టర్ ఇచ్చిన ఎలివేషన్ ప్రేక్షకులను మైమరిపించింది. దీంతో అందరూ రితిక గురించే మాట్లాడటం స్టార్ట్ చేశారు. ఆ క్షణంలోనే తనను దాచి ఉంచడం తన మంచికేనని, ఓర్పుగా ఉండటం వల్ల గొప్ప ఫలితం వస్తుందని ఆమెకు అర్థమైంది.

'మిరాయ్' హిట్.. ఇప్పుడు 'కొరియన్ కనకరాజు':
తొలి సినిమా తెచ్చిపెట్టిన పేరుతో రితికకు వరుసగా క్రేజీ ఆఫర్లు తలుపు తట్టాయి. యంగ్ హీరో తేజ సజ్జతో కలిసి నటించిన 'మిరాయ్' సినిమా బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. ఈ ప్రాజెక్ట్‌తో రితిక క్రేజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి మెగా హీరో వరుణ్ తేజ్ సరసన 'కొరియన్ కనకరాజు' చిత్రంలో జోడీగా నటించింది.

ఆగస్టు 7న గ్రాండ్ రిలీజ్: వరుణ్ తేజ్, రితిక నాయక్ కాంబినేషన్‌లో రాబోతున్న 'కొరియన్ కనకరాజు' సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ మూవీ ఆగస్టు 7 న రిలీజ్ కానుంది.

# రజనీకాంత్ నుంచి రాశీ ఖన్నాకు ప్రత్యేక బహుమతి






తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ నుంచి అందుకున్న ప్రత్యేక బహుమతి గురించి నటి రాశీ ఖన్నా అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం 'ధర్మన్' సినిమా చిత్రీకరణలో రజనీకాంత్‌తో కలిసి నటిస్తున్న ఆమెకు 'లివింగ్ విత్ ది హిమాలయన్ మాస్టర్స్' అనే ఆధ్యాత్మిక పుస్తకాన్ని ఆయన బహుమతిగా ఇచ్చారు. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో ద్వారా వెల్లడించారు. 'ధర్మన్' షూటింగ్ సమయంలో ఆధ్యాత్మికతపై తమ మధ్య చర్చ జరిగిందని రాశీ తెలిపారు. ఆ సందర్భంగా ఈ పుస్తకం చదివావా అని రజనీకాంత్ అడిగారని చెప్పారు. తాను లేదని చెప్పిన రెండు రోజులకే స్వయంగా ఆ పుస్తకం తీసుకొచ్చి బహుమతిగా ఇచ్చారని వెల్లడించారు. అంతేకాదు, పుస్తకం చదివిన తర్వాత ప్రశ్నలు కూడా అడుగుతానని సరదాగా చెప్పారని గుర్తుచేసుకున్నారు. గత కొన్ని వారాలుగా ఆ పుస్తకాన్ని ఎంతో ఆసక్తిగా చదువుతున్నానని రాశీ చెప్పారు. అందులోని కొన్ని పేజీలు చదివిన ప్రతిసారీ ఆలోచనలో మునిగిపోతున్నానన్నారు. మనలో చాలామంది తమ అసలు వ్యక్తిత్వాన్ని కోల్పోయి, వేరొకరిగా మారేందుకు ప్రయత్నించడం వల్లే అంతర్గతంగా దూరమవుతున్నామనే భావన తనను బాగా ప్రభావితం చేసిందని వెల్లడించారు. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో రూపొందుతున్న 'ధర్మన్'పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. రజనీకాంత్, రాశీ ఖన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం తమిళంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటిగా నిలిచింది.